# మిసిమి

మాస పత్రిక

ఆగష్టు - 2005



రూ.8/-

చిత్రకారుడు : **విషలర్**

(1834-1903)





అద్దం ముందు

# మిసిమి

**"All that we are is the product of what we have thought" is "We are what we think." - Dammapada.**

సంపుటి 16 ఆగస్టు 2005 సంచిక 8

వ్యవస్థాపక సంపాదకుడు : **డాక్టర్ రవీంద్రనాథ్ ఆలపాటి**

## విషయ సూచిక

ఏది హాలాహలమో, అదే అమృతం కూడా — మూలం : ఫిరాక్ గోరఖ్‌పురి, అనువాదం: డా. జె. లక్ష్మిరెడ్డి

జీర్ణం - జీర్ణం — వింజనంపాటి రాఘవరావు

ఫాల్ స్టాఫ్ - నీమ్‌చంద్ - గిరీశం — డా. యు.ఎ. నరసింహమూర్తి

శరత్ జ్యోత్స్నకాంతులు - విషలర్ చిత్రాలు — కాండ్రేగుల నాగేశ్వరరావు

మార్క్విజ్ డి శేడ్ - శేడిజం — బి.వి. రామిరెడ్డి

స్వయం నియంత్రణ — షణ్ముఖానంద

విడిప్రతి రూ. 8/- వార్షిక చందా రూ. 100/- విదేశీయులకు $ 20

ముఖచిత్రం : **షంపోనీవైట్ - I**

చిత్రకారుడు : **విషలర్**

Printed & Published by **Bapanna Alapati,** at Kala Jyothi Process Pvt. Ltd., 1-1-60/5, R.T.C. 'X' Roads, Musheerabad, Hyderabad - 20. Ph. 27645536
E-mail : misimieditor@rediffmail.com

సంపాదకుడు : **అన్నపరెడ్డి వెంకటేశ్వర రెడ్డి**

# మనిషి - విలువలు - విజయాలు

విజయవంతమైన జీవితాలు విలువైన జీవితాలు కానవసరం లేదు. అలెగ్జాండర్, నెపోలియన్, బిల్ గేట్లు, తాతాలు, బిర్లాలు ఎన్నో విజయాలను సాధించారు. అలెగ్జాండర్ ది గ్రేట్, అశోక ది గ్రేట్, అక్బర్ ది గ్రేట్‌లు గొప్ప చక్రవర్తులుగా చరిత్ర పొగిడింది. ఆ ముగ్గురి జీవితాలకు విజయాలకు ఎంతో తేడా ఉంది. అశోకుడు మిగతా ఇద్దరికంటే వేరు. ఇతడు విజయుడై, ప్రపంచం అంతా దేనిని విజయంగా పొగిడిందో దానిని కాదని విలువైన జీవితాన్ని కొనసాగించాడు. విజయవంతమైన జీవితం విలువైన జీవితం కాదని నిరూపించాడు.

విజయాలు అందరి దృష్టిలో విలువైనవి కావు. 'గెలుపు ఓటములకు నేనిచ్చే నిర్వచనం వేరు'' (గత నెల మిసిమి) అన్నాడు జయప్రకాశ్ నారాయణ. అసలు విజయం అంటే ఏమిటి? అందరూ అంగీకరించిన నిర్ణయం ఏదీలేదు. కొంతమంది దృష్టిలో కోట్లు సంపాదిస్తే విజయం. పరీక్షల్లో ప్రథమగణ్యత పొందితే విజయం. 35 మార్కులు వస్తే పండితుడు. 34 మార్కులు వస్తే శుంఠ. అసలు ఎవరు నిర్ణయించారు 35 మార్కులు వస్తే గణ్యుడైనట్లు - ఎదుటివారు, తాను మాత్రం కాదు. ప్రపంచం దృష్టిలో విజయమైనది తన దృష్టిలో కాక పోవచ్చు.

ఈ పైపై విజయాలు కోసం "I am ok you are ok", విజయానికి 36మెట్లు, లాంటి పుస్తకాలు పుంఖాను పుంఖంగా వచ్చాయి. ఈ పుస్తకాలను లక్షలాది జనం చదివారు. మూర్తి వికాసం ( వ్యక్తిత్వ వికాసం కాదు) శిక్షణ తరగతులకు ఎంతో ధనం కాలం వెచ్చించి హాజరయ్యారు. అయినా వారిలో ఎంతమంది విజయవంతమైన జీవితాన్ని పొందగలిగారు?

విలువైన జీవితం వేరు, విజయవంతమైన జీవితం వేరు అని నిరూపించిన మహామహులెంతో మంది ఉన్నారు. బుద్ధుడు, క్రీస్తు, గాంధీ, ఐన్‌స్టైన్ లాంటి వారున్నారు. ఐన్‌స్టైన్ శాస్త్రపరంగా ఎన్నో విజయాలు సాధించినా, నోబెల్ బహుమతి అందుకొన్నా, వీటన్నింటిని మించి ఆయన విలువల జీవితాన్ని పండించుకొన్నాడు. గాంధీ మరణ వార్త విని ఆయన ఒకమాట అన్నాడు: ''భావితరాలు ఇటువంటి ఒక వ్యక్తి, రక్త మాంసాలతో, ఈ భూమి మీద నడయాడాడంటే నమ్మవు.''

గాంధీ, బుద్ధుడు, క్రీస్తులు కోట్లకు పడగలెత్తలేదు, సామ్రాజ్యాలు జయించ లేదు. ప్రపంచ మానవాళి హృదయ పీఠాలను జయించి తమ విలువలతో - జయాలతో కాదు - మానవ హృదయ సామ్రాజ్యాన్నే జయించారు.



# ఏది హాలాహలమో, అదే అమృతం కూడా

1969వ సం॥ జ్ఞాన పీఠ సాహిత్య పురస్కారం స్వీకారోపన్యాసం ముఖ్యాంశాలు
(ఉర్దూ నుండి హిందీలోకి అనువదింపబడిన ఉపన్యాసానికి తెలుగు)

అనువాదం: **డాక్టర్ జె. లక్ష్మిరెడ్డి**



ఫిరాక్ గోరఖ్ పురి
(1896-1982)

ఇలాంటి ఉత్సవ సందర్భాల్లో పురస్కారం పొందిన వ్యక్తి కొన్ని ప్రశ్నలను వెలుగులోకి తెచ్చే తగిన మాటలు కొన్ని చెపుతాడని ఆశించడం కద్దు. తమ సేవలను విశేషంగా అందించిన వారిని ప్రపంచం తన ఆదేశకులుగానో, లేక మార్గదర్శకులుగానో భావిస్తుంది. రాజకీయాలకు గాని, లేక మరే ఇతర రంగానికిగాని చెందిన యుగ కర్తలయిన నాయకులను ప్రపంచం ఎంతగానో గౌరవిస్తుంది. కాని, ప్రపంచ గాథ ఎల్లప్పుడు పరివర్తన చెందుతూనే ఉంటుంది. పరివర్తన చెందే ఈ నియమం ప్రసిద్ధి విషయంలో కూడా తన ప్రభావం చూపుతూ ఉంటుంది. కాలక్రమంలో గొప్ప గొప్ప కర్మ వీరుల పేర్లు, వారి కీర్తి మసకబారి పోతూ ఉంటాయి. ఈ కీర్తి సమర్థులైన వారిని కూడా వెక్కిరిస్తూ ఉంటుంది. చరిత్ర ఒక వ్యంగ్యం. అది తనను తాను హేళన చేసుకోవడానికి కూడా వెనకాడదు. ఈ విషయాలకు బుజువులు ఉన్నాయి. చరిత్రకెక్కిన వీరులను, నాయకులను, మహోన్నత ఆలోచనా పరులను, అఖండ ఆవిష్కారాలకు జన్మనిచ్చిన వైజ్ఞానికులను, తత్త్వశాస్త్రజ్ఞులను, గొప్ప గొప్ప సభ్యతలను నిర్మించిన వారిని, అందరిని కూడా సర్వశక్తివంతమైన ఈ పరివర్తన శాసిస్తూ ఉంటుంది. ఎంత ఉన్నతులైనా దాన్ని అధిగమించలేరు. గొప్ప ఇంగ్లీషు కవి ఇలా అన్నాడు:

''మనం తయారు చేసిన ఆలోచనల, పరంపరల, విశ్వాసాల ప్రపంచాలు ప్రవర్ధమానం కావడానికి ఒక యుగాన్ని ఆధారం చేసుకుంటాయి. ఆ యుగం తర్వాత ఆ ప్రపంచాలు అంతరిస్తాయి, లేక విలీనం చెందుతాయి. ఓ పరివర్తనా! ఇవన్నీ నీ అఖండ ప్రకాశపు చెదురు మదురు వెలుగులు. వీటన్నింటి కంటే నీవు గొప్పదానివి.''

కవుల, సాహిత్య రచయితల, గొప్ప కళాకారుల ఖ్యాతి బహుదూరం వ్యాపించడమే కాక బహుకాలం నిలిచి ఉంటుంది కూడా. కాళిదాసు జ్ఞాపకాలు ఇప్పటికీ తాజాగా ఉన్నాయి. అంత సజీవంగా, అంత తాజాగా విక్రమాదిత్యుని పేరు లేదు. ఫిరదౌసీ, షేక్స్‌పియర్, వర్డ్స్‌వర్త్, కోలరిడ్జ్, కీట్స్, శెలీ, బైరన్‌ల పేర్లు సజీవంగా నిలిచి ఉన్న పేర్లు. వారి స్వరాలు ప్రాణవంతమైన స్వరాలు. కాని, ప్రాణవంతంగా ఉండే ఈ గుణం ఫ్రాన్స్ విప్లవకారుల పేర్లలో మనకు కనిపించదు. మరింత వెనక్కు వెళ్తే, మిల్టన్, జాన్సన్, గోల్డ్‌స్మిత్ రాసిన రచనలు నేడు ఎంత ప్రాణవంతంగా ఉన్నాయో, అంత ప్రాణవంతంగా ఆయా

డాక్టర్ జె. లక్ష్మిరెడ్డి, ఢిల్లీ యూనివర్శిటీలో హిందీ ఆచార్యులు

కాలాలలోని, యుగాలలోని కర్మవీరుల సత్కార్యాలు లేవు. కేవలం ప్రకృత సంబంధ కార్యాలు దీర్ఘకాలం జీవించవు. కాని, కవుల, కళాకారుల ఖ్యాతి అమరమైనది, విస్తారమైనది. దాని ఎదుట ఇతరుల ఖ్యాతి కేవలం గాలిలో ఎగిరే ధూళిలాగా కనిపిస్తుంది. ఈ ధూళి మేఘాలు బాగా పైకి ఎగిరి కొద్దిసేపు ఆకాశాన్నే తాకవచ్చు గాక! అయినా అవి ఎక్కువ కాలం నిలువవు. కవుల, కళాకారుల జ్ఞాపకాలు అక్షయ వటవృక్షం వలె నాశము లేనివి, సదా ప్రకాశించేవి. ఎందుచేతనంటే వీరి రచనలు జీవితపు అచంచలమైన, అమరమైన విశ్వాసాలకు స్వరాన్నిస్తాయి, గాఢ అభివ్యక్తినిస్తాయి. సేనాపతి అయిన వోల్ఫ్, క్యుబెక్ యుద్ధ భూమిలో కవి టామస్ గ్రే రాసిన ఈ పంక్తులు మెల్ల మెల్లగా తనలో తాను పాడుకుంటున్నాడు:

The boast of heraldry, the pomp of power,
And all that beauty, all that wealth e'er gave,
Await alike the inevitable hour,
The paths of glory lead but to the grave.

ఉజ్వలమైన, వైభవోపేతమైన శూరతా వీరతల దర్పము, అధికార ఆడంబరము, సంపద, సౌందర్యాలు ప్రసాదించే సమస్త వస్తుజాలము, అన్నీ చివరకు ఎవరికీ నివారించ శక్యము కాని ఘడియ కోసం ఒకే విధంగా ఎదురు చూడవలసిందే. మార్గాలన్నీ కూడా మనిషిని చివరకు శ్మశానానికే తీసుకెళ్తాయి'' అని తెలుసుకున్న వోల్ఫ్ నేను ఒక యుద్ధ విజేతను కాక ఈ పంక్తులు రాసిన కవినయి ఉంటే ఎంత బాగుండును అనుకున్నాడట!

కర్మ-జీవితంలో చాలా అవసరమైన విషయమే. కాని ప్రతి మనిషి కర్మకంటే తన ఆంతరిక అనుభవాలకే ఎక్కువ ప్రాధాన్యత ఇస్తాడు. విజ్ఞానావిష్కారాలలోను, ప్రయోగాల లోను వచ్చిన ఎదుగుదల, వృత్తిపరంగా మనం చేసే శారీరిక, మానసిక శ్రమకంటే, మన ఆంతరంగిక అనుభవాలు, అనుభూతులు ఎక్కువ విలువైనవనే సత్యాన్ని మనకు చూపుతూంది. నిజమే, మనం శారీరిక శ్రమ చేయవలసిందే. కాని, మన వ్యక్తిత్వం కూడా వికసించాలి కదా! ఈ వ్యక్తిత్వాన్ని సుసంపన్నం చేయడంలో కవిత్వం అన్నింటికంటే ఉత్తమ సాధనం.

ఇక నేను నా వ్యక్తిగత జీవితంలోని ఆంతరంగిక అనుభవాల గురించి, నా కావ్య ప్రపంచ సృష్టి గురించి కొంత చెప్తాను. శరీరం ద్వారా కానీ, ఇంద్రియాల ద్వారా కానీ, నేను ఎలాంటి అనుభవం పొందినా, దానికి అనుగుణంగా ప్రతివస్తువులో, ప్రతి సంఘటనలో, భౌతిక ప్రపంచపు ప్రతి దృశ్యంలో, ఒక నిగూఢ ఆంతరికత, రహస్యాత్మకత ఉంటాయని నాకు చిన్నప్పటి నుండి అనిపిస్తూ ఉండేది. ప్రతి వస్తువు, కొన్ని నిర్ణీత పరిమితుల్లో ఉంటూ కూడా ఆ పరిమితులను అధిగమించి వెళ్తున్నట్లు అనిపించేది. కుటుంబ జీవితము, దానికి సంబంధించిన అతి సామాన్య వస్తువులు, మాటలు, పరిచిత దృశ్యాలు, నదులు, కాలువలు, పండ్లతోటలు, పచ్చటి పొలాలు, ఆట బొమ్మలు, దేన్ని చూసినా,

స్పృశించినా, విన్నా మరే దాన్ని గురించి ఏ అనుభవం పొందినా, అన్నింటికి ఒక ఆంతరంగిక జీవితం ఉందని, అదే వాటి అమూల్య సత్యమని నాకు అనిపిస్తూ ఉండేది. భౌతిక ప్రపంచపు రహస్యాత్మకత మాటిమాటికి నా చైతన్యాన్ని ఆవరించి వేసేది. భౌతిక ప్రపంచంలోనే భౌతిక ప్రపంచపు దివ్యత్వం నాకు స్ఫురిస్తూ ఉండేది. ఈ స్ఫురించడం ఎక్కడో బయట, దూరంగా ఉండే భగవంతుణ్ణి నమ్మవలసిన అవసరం నుండి నన్ను మెల్లమెల్లగా విముక్తుణ్ణి చేస్తూ వచ్చింది. కావ్యాత్మకమైన ప్రపంచానుభవం ప్రపంచపు దివ్యత్వానికి, దాని ఐశ్వర్యమయ శక్తికి మూర్తరూపం. నా వయసు, ప్రపంచంతో నా పరిచయం పెరిగే కొద్దీ ఆధ్యాత్మికతతో నిండిన భౌతికత (spiritualised materialism) నాలో వికసిస్తున్నట్లుగా నాకు అనుభవం కాసాగింది. ఈ అనుభవం నా వ్యక్తిగత అనుభవం మాత్రమే కాదని, నిజానికి ఈ అనుభవమే హిందూ సంస్కృతికి ఆధారమని నాకు అనిపించేది. ప్రకృతిలోని అణువణువుతో రక్తసంబంధం ఉన్నట్లుగా అనుభూతి పొందడం, ప్రతి వస్తువుతో మనకు అంతస్సంబంధం ఉన్నట్లు భావించడం ఆ పైన ఈ అనుభూతి నుండి శాంతి, ఆనందము, ఆత్మీయత పొందడం భారతీయ సంస్కృతి యొక్క స్వర్ణయుగం నుండి మనకు ప్రాప్తించిన అన్నిటికంటే విలువైన సంపత్తి. పరాయితనము, వేర్పాటు భావన మన ఆత్మను, చైతన్యాన్ని హీనపరుస్తాయి. భారతీయ సంస్కృతిలో ఈ రహస్యాన్ని అర్థం చేసుకున్న తర్వాతనే ప్రసిద్ధ జర్మన్ తాత్త్వికుడు శోపన్‌హార్ ''ఉపనిషత్తుల నుండి నా జీవితానికి గొప్ప ఊరట లభించింది. అంతే కాక నా మృత్యు క్షణాల్లో కూడా చాలా గొప్ప ఊరట లభిస్తుంది'' అని అనేవాడు. హైందవ సంస్కృతి కున్గొన్న ఈ సత్యానుభూతి హైందవ సమాజంలో జన్మించిన వారికి మాత్రమే కలిగిందని చెప్పలేము. ప్రతి యుగంలో ఇతర జాతుల, దేశాల ఆత్మ సిద్ధులు కూడా సరిగ్గా ఇలాంటి అనుభూతినే పొందారు. హిందూ సమాజం మాత్రమే అందులో వేర్వేరు వర్గాలుగా కర్షకులు, వ్యాపారులు, పెట్టుబడిదారులు, సమాజవాదులు, ఎందరున్నా బహిరంగమైన సమాజం అని నాకు అనిపించసాగింది. ఇతర సంస్కృతులు మన ఆత్మను, మన దృష్టిని, మన సహానుభూతులను సంకీర్ణ పరుస్తాయి. మానవ కుటుంబాన్ని విభజిస్తాయి. హిందూ సంస్కృతి మాత్రమే భిన్న మతాంతరాల సంకెళ్ళ నుండి విముక్తి కలిగిస్తుంది. ప్రపంచ సాహిత్యంలో ఎక్కువ భాగం మానవీయ భావాలకు సంబంధించిందే. జాతికి, మతానికి సంబంధించింది కాదు. ఆ సాహిత్యమే అమిత విలువైనది కూడా. హిందువులం కావడం వల్ల గొప్ప ప్రపంచ సాహిత్యం చదివేప్పుడు రచయిత హోమర్, వర్జిల్, ఫిరదౌసీ, షేక్స్‌పియర్, లేక మరో ప్రసిద్ధ కవి, రచయిత అయినా - అతడు హిందువు కాదు, అనే భావన మనకు కలగనే కలగదు. మనకు మానవీయ సంస్కృతిని ప్రసాదించడమే కవితా లక్షణం లేక ఉద్దేశ్యం. కవిత్వం అంటే మానవ దేశ స్థాపన, హిందూ దేశ స్థాపన కాదు.

కవిగా నేను నా రచన పిన్న వయసులో ఆరంభించలేదు. ప్రౌఢ వయసులోనే ఆరంభించాను. ఈ లోగా నా జీవితం నిర్మూలమై, నాశనమై ఉంది. ఆక్లిష్ట సమయంలో కవిత్వ రచన ఆరంభించినప్పుడు కవిత్వంలో ఏ శాంతి సౌఖ్యాలను ప్రస్తావించానో, వాటికి, నా దుఃఖమయ జీవితానికి పొంతన ఎలా

కుదర్చాలి, అనే సమస్య నాకు ఎదురైంది. దుఃఖాన్ని సుఖ సందేశంగా ఎలా మార్చాలి అనేదే సమస్య. దీని పరిష్కార క్రమం మెల్లమెల్లగా ఏర్పడుతూ వచ్చింది.

''బ్రతుకులోని సుఖదుఃఖాలు ఎలా జీర్ణించుకున్నానో, నన్నడగవద్దు. అవి మరొకరికి కలిగి ఉంటే వారి ఎముకలు కూడా మిగలకుండా పోయేవి.

★ ★ ★

''ఏది హాలాహలమో, అదే అమృతం కూడా. అది ఎలా త్రాగాలో, నీకు తెలుసుకాని, నాకు మాత్రం తెలియదు.''

సాహిత్యంలో అత్యంత స్వేచ్ఛము, క్రూరము, సర్వశక్తిమంతము, అయిన శాసన శక్తిగా ప్రేమను పేర్కొంటారు. దైవమో, దైత్యమో అయిన ఈ ప్రేమతో ఒక ఒప్పందం కుదుర్చుకోవడం నా ప్రథమ కార్యం అయింది. ప్రేమ అనే ఈ స్వేచ్ఛాచరము నా జీవితం పైన ఎన్ని దెబ్బలు కొట్టిందో, ఎన్ని గాయాలు చేసిందో, వాటన్నింటిని ఉపశమన లేపనాలుగా మార్చుకోవలసి వచ్చింది. మనిషి అంతరాత్మ భీష్మ పితామహుని మాదిరిగా ఎప్పుడైతే గాయ పడుతుందో, అప్పుడు శాంతి పర్వం వెలువడుతుంది. కవితా జగత్తులో నా ప్రేమ కవిత్వం శాంతి, ఊరట ప్రసాదించే సాధనంగా క్రమక్రమంగా గుర్తింపు పొందింది.

ప్రతి ప్రేమ ఒక విషాదాంత నాటకమే. ప్రేమ వల్ల కలిగే బాధలను అసత్యాలుగా నిరూపించకుండా వాటిని కేవల దుఃఖావేగపు గాథా స్థాయిని మించిన స్థితిలోకి తీసుకు వెళ్ళడం, భౌతిక ప్రేమను దైవిక ప్రేమగా మార్చడం ఉన్నత శిఖరాలను అధిరోహించడం లాంటిది. అశాంతి సరిహద్దులను దాటిన తర్వాతనే శాంతి సరిహద్దులు మొదలవుతాయి. ధర్మ పరుడైన యుధిష్ఠిరునికి కూడా దేవదూత మొదట నరకమే చూపించాడు.

ప్రకృతి, బాల్య జీవితం, స్త్రీత్వం, కుటుంబ జీవితం, సమాజ జీవితం, జీవిత మర్మాలు మెల్లమెల్లగా నా కవితా వస్తువులు కాసాగాయి. మానవ గాథ, సంస్కృతి, చరిత్రలోని గొప్ప విప్లవాలు కూడా నా కవిత్వంలో వాక్శక్తిని పొంది తమ ఉనికిని చాటుకున్నాయి. చారిత్రక శక్తులు నా రచనాత్మక శక్తులను తమ వైపు ఆకర్షించడం ఆరంభించాయి. కవితా రచన వ్యక్తిగతమైన సుఖ దుఃఖాల పట్టిక తయారు చేయడం కాదు. అది మానవుని సుఖ దుఃఖాలకు వ్యాఖ్య.

మన జీవితం 'నేతి-నేతి' (బ్రహ్మ లేక ఈశ్వరుని అనంత తను తెలిపే ఒక ఉపనిషద్వాక్యం. దీని అర్థం - ఈశ్వరుని మహిమ అపారమైంది, అని) కి సంబంధించిన గాథ. ఒక స్థితిలో మనం చేసే పని, మనకు ప్రాప్తించే వస్తువులు, మన సమస్త సుఖ దుఃఖాలు భ్రమతో కూడినవిగా కనిపించడం ఆరంభిస్తాయి. జాన్ స్టువర్ట్ మిల్ తన ఆత్మకథలో స్పష్టంగా చెప్పాడు. ఆయన ఒకానొక సందర్భంలో తనను తాను ఇలా ప్రశ్నించుకున్నాడు. ''ఒక వేళ నీవు కోరుకున్నవన్నీ ప్రపంచానికి లభ్యమైతే నీకు సంపూర్ణమైన సంతృప్తి కలుగుతుందా? నిజమైన సంతోషం కలుగుతుందా?'' అని. ఆయన అంతరాత్మ జవాబు

ఇచ్చింది - ''కలగదు.'' ఘోర నిరాశ కలిగి ఆయన ఆత్మహత్య చేసుకోబోయాడు. సరిగ్గా అదే సమయంలో వర్డ్స్‌వర్థ్ కవితల ఒక సంపుటిపైన ఆయన చేయి పడింది. అప్పుడే ఆయనకు జీవితంలోని చిన్న చిన్న విషయాలు కూడా సత్యమేనని, తాత్త్వికమైనవని, యథార్థతతో కూడినవని, అవగాహన అయింది. మనకు ప్రతి వస్తువులోను ఒక విశిష్టమైన తత్త్వం లభిస్తుంది. అది లభ్యమైన తర్వాత మనకు సమస్తము ప్రాప్తించినట్లుగా భావన కలుగుతుంది. అదే జరగనట్లయితే కీర్తిశేషులైన మా గురువుగారు S.G. Dunn చెప్పినట్లు చివరన మిగిలేది ఒకే ఒక యోగ సాధన. అదే ఆత్మహత్య.

**జీవిత విశేషాలు :**

1969వ సంవత్సరపు జ్ఞానపీఠ్ సాహిత్య పురస్కారం రఘుపతి సహాయ్ ఫిరాక్ రచించిన 'గుల్-ఏ-నగ్మా' అనే కవితా సంపుటికి ప్రదానం చేయబడింది. 'గుల్-ఏ-నగ్మా' 1950-1962 మధ్య కాలంలో భారతీయ భాషలలో వెలువడిన సృజనాత్మక సాహిత్య రచనలలో సర్వశ్రేష్ఠమైనదిగా ఎంపిక అయింది.

''భారతీయ సాహిత్యాన్ని అభివృద్ధి పరచే విషయంలో ఫిరాక్ ఉర్దూ కవిత్వ స్వరానికి, సంస్కారానికి కొత్త రూపమిచ్చారు. ఆయన కవిత్వ భాష నిఘంటువుల భాష కాక సామాన్య ప్రజలు మాట్లాడే సజీవ భాష. అందులో కనిపించే స్వచ్ఛమైన శైలి, సంవేదన, ధీరత, సమతౌల్యము ఉర్దూ కవిత్వపు దీర్ఘ చరిత్రలో అరుదుగానే కనిపిస్తాయి. ఫిరాక్ కవితలోని అంతఃప్రేరితమైన సరళత అలౌకికతను స్ఫురింపజేస్తుంది. గొప్ప అర్థము, లయతో కూడిన 'ఫిరాక్' కవిత్వంలో భారతీయ సంస్కృతిలోని ఎన్నో రంగుల వెలుగు, పునర్జాగృతమైన భారతదేశ నవ మానవతా వాదపు హృదయ స్పందన ప్రతిబింబించాయి'' అని పురస్కార ఎంపిక సమితి తన 'ప్రశస్తి'లో వీరిని గురించి పేర్కొంది.

ప్రొఫెసర్ రఘుపతి సహాయ్ ఫిరాక్, గోరఖ్‌పూర్‌లో జన్మించారు. అందువల్లనే ఉర్దూ సాహిత్య సంప్రదాయాన్ననుసరించి వీరి పేరు 'ఫిరాక్ గోరఖ్ పురి'గా మారింది. వీరి తండ్రి పేరుమోసిన వకీలు, మంచి ఉర్దూ కవి. ఫిరాక్ చిన్నప్పుడు తండ్రి దగ్గరే ఉర్దూ, పర్షియన్, సంస్కృతము నేర్చుకున్నారు. తర్వాత అలహాబాదులోని మ్యోర్ సెంట్రల్ కాలేజీలో చదివి 1917లో చాలా మంచి మార్కులతో బి.ఏ. పాసయ్యారు. వెంటనే డిప్యూటీ కలక్టరుగా నియమించబడ్డారు. కాని, ఇతరులను జైలుకు పంపడం కంటే స్వయంగా జైలుకు వెళ్ళడమే మంచిదని భావించినందువల్ల డిప్యూటీ కలక్టరు పదవిని స్వీకరించకుండా కాంగ్రెసులో చేరి స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొని 1920లో జైలుకు వెళ్ళారు. ఆగ్రా, లక్నో జైళ్ళలో జవహర్‌లాల్ నెహ్రూ, మోతీలాల్ నెహ్రూల సాంగత్యంలో కాలం గడిపారు. 1922లో ఇండియన్ నేషనల్ కాంగ్రెసు అండర్ సెక్రటరీ పదవిని చేపట్టారు. కొంత కాలం తర్వాత రాజకీయాలు వదలి అలహాబాద్ విశ్వవిద్యాలయంలో ఇంగ్లీషు ఉపన్యాసకుడుగా చేరి, అక్కడి నుండే ప్రొఫెసరుగా పదవీ విరమణ చేశారు.

ఆయనది విషాదంతో నిండిన ఒంటరి జీవితం. పెళ్ళి అయిన కొద్ది సంవత్సరాలకే భార్యతో వేరయిపోయాడు. ఉన్న ఒకే ఒక్క కుమారుడు పిన్న వయసులోనే ఆత్మహత్య చేసుకున్నాడు. అలహాబాదు యూనివర్సిటీ ఆవరణలో 40 సంవత్సరాలు ఫిరాక్ ఒంటరిగా జీవించాడు. తన విచిత్రమైన జీవనశైలి, అహంభావంతో కూడిన ప్రవర్తన, తాగుడు, నైతికత విషయంలో సమాజం స్వీకరించిన కొలమానాలను తిరస్కరించి వ్యవహరించడం, ఇలాంటి చాలా కారణాలవల్ల ఆయన ఎప్పుడూ వివాదాలు సృష్టించేవాడు. ఆయనను పొగడుతూనో, తెగడుతూనో, అందరు ఆయనను గురించి చర్చించుకునేవారు. చమత్కారంగా మాట్లాడడంలో ఆయన దిట్ట. మతము, రాజనీతి, సమకాలీన రచయితలు, ఇలాంటి ఎన్నో విషయాల గురించిన ఆయన అభిప్రాయాలు మౌలికంగాను, చమత్కార పూరితంగాను, ఆసక్తి కరంగాను, వివాదాస్పదంగాను ఉంటూ ఉండేవి.

ఆయన హిందీ విరోధిగా ప్రసిద్ధుడు. ఉర్దూ ఎదుట హిందీని చులకనగా చూసేవాడు. అందుచేత హిందీ అభిమానుల కోపానికి గురయ్యాడు. హిందీ విరోధి అయినా ప్రసిద్ధ హిందీ కవులు కబీర్, తులసీదాస్, సూర్‌దాస్, రసఖాన్, బిహారీల ప్రభావం తనపైన ఉన్నట్లు చెప్పేవాడు.

ఫిరాక్ భావ వ్యక్తీకరణలో దిట్ట. మనోవైజ్ఞానిక చిత్రణలో కూడా ఈయన నేర్పరి. ఈయనపై పాశ్చాత్య కవిత్వం, నాటకం, నవల, వీటి తీవ్రమైన ప్రభావం ఉంది.

తన 60 ఏళ్ళ సాహిత్య జీవితంలో ఫిరాక్ రెండు చరణాల కవిత్వాలు 40,000 రాశాడు. 'గుల్-ఏ-నగ్మా' (గేయ పుష్పాలు) అనే కవితా సంపుటికి 1960లో సాహిత్య అకాడెమీ పురస్కారం లభించింది. అదే కవితా సంపుటికి 1969లో జ్ఞాన పీఠ్ పురస్కారం లభించింది. ఈ పురస్కారం అంతవరకు ఉర్దూ కవులకు లభించిన పురస్కారాలలో అన్నిటికంటే పెద్దది.

ఆయన దేశ సాహిత్యానికి అందించిన సేవలకు గాను ప్రభుత్వం 'పద్మభూషణ్' బిరుదు నిచ్చి సత్కరించింది.

భారతీయత ఆయన కవిత్వంలో కనిపించే ముఖ్యమైన విశేషత. ఉర్దూ గజల్‌పైన ఎప్పుడూ ఉండే పర్షియన్ ప్రభావాన్ని తొలగించి దాని స్థానంలో భారత దేశపు మట్టి సుగంధాన్ని, సంస్కృతిని నింపడానికి ఆయన ప్రయత్నం చేశాడు. భారత దేశపు పౌరాణిక గాథలలోని ఎన్నో అంశాలు, జానపద వాఙ్మయంలోని విశేషతలు, భారతదేశపు పల్లెసీమల దృశ్యాలు ఆయన కవిత్వంలో విరివిగా చోటు చేసుకున్నాయి.

ఇదంతా జరిగింది ఆయన హిందువు కావడం వల్ల కాదు. విదేశీ సంస్కృతి, విదేశీ సాంఘిక ఆచారాలు, నెలకొని ఉన్న ఉర్దూ కవిత్వంలో పాఠకులకు, రచయితకు మధ్య దూరం చాలా పెరిగి పోయి ఉందని, కవిత్వపు ఆస్వాదన కష్టమై పోయిందని, ఆయన భావించేవాడు. తన కవిత్వంలో ఆయన తెచ్చిన మార్పుకు కారణం ఇదే.

# జీర్ణం - జీర్ణం

**- వింజనంపాటి రాఘవరావు**

''భోజనం కాస్త ఉదాత్తమైంది. ఓ పూట నిరాహారదీక్షచేయటానికి కారణం చూడవోయ్ సెక్రట్రీ,'' అంటాడు ప్రఖ్యాత చిత్రకారుడు బాపు 'కార్టూన్' రాజకీయ నాయకుడు. కాస్త ఆకలి ఎక్కువై ఆవురావురని తినేవాణ్ణి బకాసురడంటాం. అతిగా తింటే అగ్నిదేవుడైనా అజీర్ణవ్యాధికి గురవుతాడని పురాణ కథనం. అజీర్ణంతో బాధపడే వాళ్ళు ఎంత కమ్మటి, రుచికరమైన వంటకాన్నైనా వాసన చూసి వదిలేయాల్సిందే. ఏదైనా తినగానే సరికాదు - హరాయించుకునే శక్తి కూడా వుండాలి. అన్ని రోగాలకూ అజీర్ణమే ప్రధానకారణం అంటుంది ఆయుర్వేదం.

ప్రాచీన రోమ్ సామ్రాజ్యంలో శ్రీమంతుల ఇళ్ళలో వాంతులు చేసుకోవడానికి ఓ గది వుండేదట. తినటానికెన్నో రుచికరమైన పదార్థాలూ, కావలసినంత మద్యం, ఇంకా ఇంకా తనవితీరా త్రాగటానికీ తినటానికీ వీలుగా అతిథులు అప్పటి దాకా తిన్నదాన్ని వాంతిచేసుకోవటం కోసమే ఈ గదులు.

ఈ వ్యాసం చదివేసమయానికి మీరు ఏదో ఒకటి తినేవుంటారు. లఘువుగా ఇడ్లీ - సాంబారు, పూరీ - కూర, బ్రెడ్ - ఆమ్లెట్ వంటి వాటినో, అన్నం - పప్పు, సాంబారు, కూర, పెరుగు ఇతర మాంసాహారపు వంటలతో కాస్తంత గట్టిగా భోజనమో చేసి వుంటారు. వీటితో పాటుగా మరిన్ని ఆహార పదార్థాలు మీరు తిన్నా, మీరు తిన్నవి మాత్రం కేవలంమూడు రకాలే. ఇందులో వేళాకోళం ఏమీలేదు. జీవరసాయన శాస్త్ర దృష్ట్యా (Bio-Chemistry) మీరు తిన్నవి మూడు రకాల పదార్థాలే. అవి పిండి పదార్థాలు (carbohydrates), మాంసకృత్తులు (protgins), మరియు క్రొవ్వులు (lipids). మిఠాయిల దుకాణంలో ఎన్ని రకాల తీపి పదార్థాలున్నా, అన్నింటిలోనూ వుండేది చక్కెరే కదా! మన కంటికి కనుపించని సూక్ష్మ జీవుల నుండి, అభివృద్ధి చెందిన జీవుల వరకూ పై మూడింటినే ఆహారంగా తీసుకుంటాయి.

మనం తినే రక రకాల ఆహారపదార్థాలు ఎలా జీర్ణమౌతాయి. అందరికీ ఈ అనుమానం సహజంగానే వస్తుంది. వేటగాళ్ళు సహజ కుతూహలంతో జంతువుల పేగులుకోసి చూస్తారు. పేగుల్లో ఆహారం ఎలా వుంటుంది? ఒకే 'కుక్కరు' గిన్నెలో అన్ని ఆహార పదార్థాలను వేసి ఉడికించి, బాగా ఎనిపితే ఎలా వుంటుందో, పేగులోని పదార్థాలు అలా వుంటాయి. మన శరీరంలో 'కుక్కరు' లేదు కదా! తిన్న ఆహారం అలా తయారవటానికి కారణం ఏమిటి? ఈ ప్రశ్న చాలా కాలం పాటు సాధారణ మానవునితో పాటు శాస్త్రజ్ఞులనూ వేధించింది. ఆలోచింపచేసింది.

'ఇవాన్ పావ్‌లోవ్ (Ivan Pavlov) అనే రష్యా దేశపు శరీర ధర్మశాస్త్రవేత్త (Physiologist) జీర్ణ రసాల గురించి పరిశోధించి, లోకానికి వెల్లడించేవరకు జీర్ణక్రియ అంతుపట్టని రహస్యంగానే వుండిపోయింది. జీవులలో జీర్ణక్రియా విధానాన్ని స్థూలంగా పరిశీలిద్దాం.

మనం రోజుకు ఎన్నిసార్లు తినాలి? కొంచెం చిక్కు ప్రశ్న ఇది.

రోజుకు ''ఒకసారి తినేవాడు యోగి, రెండు సార్లు తినేవాడు భోగి, మూడు సార్లు తినేవాడు రోగి'' అని ఆయుర్వేదం ఎన్నిసార్లు భోజనం చేయాలో నిర్దేశించింది. ఆయుర్వేదం వైద్య

---

వింజనంపాటి రాఘవరావు, జంతుశాస్త్రోపన్యాసకుడు, ఆం.ప్ర.గు. జూనియర్ కళాశాల,
కొడిగినహళ్ళి, అనంతపురం జిల్లా - 515 212.

విధానమేకాదు, ఆరోగ్య విధానం కూడ. ఇక్కడ చెప్పిన సూత్రం మనుష్యులకు మాత్రమే వర్తిస్తుంది. శాకాహారులు రోజులో ఎక్కువభాగం తినటంలోనే గడుపుతాయి. అదే మాంసహారులైతే ఆహారం దొరకటాన్ని బట్టి రోజుకోసారో, కొన్ని రోజుల కొక సారో తింటాయి. జీవి మాంసాహారైనా, శాకాహారైనా అమీబా అయినా, ఏనుగైనా ఆహారం జీర్ణమయే విధానం మాత్రం ఒక్కటే. ఈ విషయంలో అన్ని జీవులలోనూ ఏకసూత్రత కన్పిస్తుంది. ఆహారాన్ని నమలకుండా ఉన్నపళంగా మింగే చేపలు, కప్పలు, పాములు, గింజలు తినే పక్షులను మినహాయిస్తే మిగిలిన జంతువులు ఆహారాన్ని ముక్కలు చేసి తింటాయి.

క్షీరదాలలో మాత్రమే నోట్లో లాలాజలం ఉత్పత్తి అయి ఆహారంలో ఉండే పిండి పదార్థాలను కొద్దిగా జీర్ణం చేస్తుంది. మిగిలిన జీవులలో నోట్లో జిగురుగా ఉండే శ్లేష్మం తయారై ఆహారం తేలికగా గొంతులోంచి జారి పోవటానికి తోడ్పడుతుంది.

నోట్లోంచి ఆహారం ఆహారవాహిక ద్వారా జీర్ణాశయంలోకి వెళుతుంది. గొంతుపట్టుకున్నప్పుడు ఆహారం మెల్లిగా ఆహార వాహికవెంట దిగటం మీరు గమనించే ఉంటారు.

జీర్ణాశయంలో తయారయే జఠర రసంలో 'హైడ్రోక్లోరిక్' ఆమ్లం (HCl) ఉత్పత్తి అవుతుంది. ఈ ఆమ్లం ఆహారంలో ఉండే సూక్ష్మజీవులను చంపేస్తుంది. జీర్ణాశయంలోనే మాంసకృత్తులు పాక్షికంగా జీర్ణమౌతాయి. పిల్లలలో పాలు జీర్ణమవటానికి అవసరమయే 'రెనిన్' (Renin) అనే ఎంజైము ఇక్కడే ఉత్పత్తి అవుతుంది.

ఆహారం కొద్ది కొద్దిగా ఆంత్రమూలమనే చిన్నప్రేగు మొదటి భాగంలోకి చేరుతుంది. అక్కడ కాలేయం నుండి పైత్యరసం ఆహారంతో కలిసి దానికి రంగు నిస్తుంది. పైత్యరసంలో ఉండే లవణాలు క్రొవ్వు పదార్థాలు జీర్ణం కావటంలో తోడ్పడతాయి. ఇక క్లోమం నుంచి వచ్చేస్రావంలో ఉండేఎంజైములు, పేగుగోడలలో తయారయే జీర్ణ రసాలు ఆహారాన్ని పూర్తిగా జీర్ణం చేస్తాయి.

ఆంత్రమూలంలోని మొదటి భాగాన్ని తొలగిస్తే జీవి చనిపోతుందని శాస్త్రజ్ఞులు గుర్తించారు. కాని దీనికి సరైన కారణం ఇంకా తెలియటం లేదు.

పేగులలో జీర్ణమైన ఆహారం పేగు గోడల ద్వారా రక్తంలోకి పీల్చుకోబడుతుంది. జీర్ణంకాని ఆహారం పెద్ద పేగులోకి చేరుతుంది. అక్కడ ఆహారంలో ఉండే నీరు పూర్తిగా రక్తంలోకి పీల్చుకోబడుతుంది. బాక్టీరియా ఆహారంపై పనిచేస్తాయి. జీర్ణం కాని ఆహారం మలద్వారం ద్వారా బయటకు విసర్జింపబడుతుంది.

జీవి శాకాహారైనా, మాంసాహారైనా జీర్ణ క్రియా విధానం మాత్రం ఇదే. మరి శరీరంలో శాశ్వతమైన నోరు, జీర్ణ వ్యవస్థ లేని జీవులూ ఉన్నాయి భూమ్మీద. వాటి సంగతి ఏమిటి? ఏక కణజీవి అమీబాలో ఆహారం శరీరం మీద ఎక్కడ తాకితే అక్కడే నోరు ఏర్పడుతుంది. ఆహారం శరీరంలోకి చేరగానే తాత్కాలికంగా జీర్ణాశయం ఏర్పడి ఆమ్లం తయారౌతుంది. తర్వాత ఈ జీర్ణాశయం పేగుగా మారుతుంది. ఆహారం జీర్ణంకాగానే ప్రోటో ప్లాసమ్‌లోకి పీల్చుకోబడుతుంది. జీర్ణం కాని వ్యర్థం తాత్కాలికంగా ఏర్పడే మలద్వారం ద్వారా విసర్జింపబడుతుంది. అన్నీ తాత్కాలిక భాగాలే అయినా

క్రియ మాత్రం పూర్తిగా అభివృద్ధి చెందిన జీవులలో లాగానే జరుగుతుంది. ఈ రకమైన జీర్ణ క్రియను 'కణాంతర్గత జీర్ణక్రియ' అంటారు.

కొంచెం అభివృద్ధి చెందిన 'హైడ్రా' వంటి జీవులలో ఆహారం 'సీలెంటిరాక్' అనే కుహరంలోకి నోటి ద్వారా చేరి పాక్షికంగా జీర్ణ మౌతుంది. పాక్షికంగా జీర్ణమైన ఆహారాన్ని కణాలు మింగి పూర్తిగా జీర్ణం చేసుకుంటాయి. జీర్ణం కాని ఆహారం మరల నోటి ద్వారా బయటకు విసర్జింపబడుతుంది. దీనిలో మలద్వారాం ప్రత్యేకంగా ఉండదు.

జీర్ణమైన ఆహారం ఒక కణం నుండి మరొక కణానికి వ్యాపన పద్ధతిలో అందించబడుతుంది. మరికొంత అభివృద్ధి చెందిన చప్పటపురుగులు అనబడే Flat Worms లో జీర్ణ వ్యవస్థే పదార్థాల రవాణా కూడా చేపట్టింది. దీనివలన శరీరంలో ఐదింట నాలుగు వంతులు జీర్ణవ్యవస్థ ఆక్రమించింది. శరీరమంతా కడుపే అయితే ఎవరికైనా భారమే కదా! అందుకే ప్రకృతి దీన్ని తిరస్కరించింది. జీర్ణ వ్యవస్థ, ప్రసరణ వ్యవస్థ వేర్వేరు విభాగాలుగా తర్వాతి తరం జీవులలో రూపొందాయి.

ఏలిక పాము వంటి గుండ్రని పురుగులలో పేగు ఉన్నప్పటికీ అది జీర్ణక్రియకు తోడ్పడదు. పేగులో క్రొవ్వు పదార్థాలు నిల్వ ఉంటాయి. శరీరంలోని కణాలలో ఉత్పత్తి అయిన జీర్ణ రసాలు అవభాసిని అనే పొరలో ఉండే సన్నని రంధ్రాల ద్వారా ఆహారంపైకి వదలబడతాయి. ఆహారం శరీరం బయట జీర్ణమవుతుంది. శరీరంబయటే జీర్ణమైన ఆహారం నోటి ద్వారా, అవభాసినిలోని రంధ్రాల ద్వారా శరీరంలోకి చేరుతుంది.

ఈ విధంగా ఆహారం శరీరం బయట జీర్ణం కావటాన్ని 'శరీర బాహ్య జీర్ణ క్రియ' (Extra Corporal Digestion) అంటారు.

ఆహారాన్ని శరీరం బయట జీర్ణం చేసుకుని తినటం గుండ్రని పురుగులకే పరిమితం కాదు. సముద్రపు అడుగున నివసించే నక్షత్రపు చేపలు కూడా ఇదే పద్ధతిని అనుసరిస్తాయి. ఈ స్టార్ ఫిష్‌లనే నక్షత్రపు చేపల ఇష్టమైన ఆహారం నత్తగుల్లలు. అయితే నత్త తన గుల్ల ద్వారాన్ని గట్టిగా మూసి లోపల ఉంటుంది. 'స్టార్‌ఫిష్' నత్తగుల్ల మూతను విడదీయటానికిగట్టి ప్రయత్నం చేస్తుంది. ఈ ప్రయత్నంలో ఒక మిల్లీమీటరు రంధ్రం ఏర్పడినా చాలు - స్టార్‌ఫిష్ తన పొట్టను గుల్లలోకి ప్రవేశపెడుతుంది. పొట్టలోంచి విడుదలయ్యే జీర్ణ రసాలు నత్తను గుల్లలోనే జీర్ణం చేస్తాయి. జీర్ణమైన ఆహారాన్ని స్టార్‌ఫిష్ తీసుకుంటుంది.

మీరు పుచ్చుల్లేకుండా వంకాయలు, బెండకాయలు సరిగా ఎంపిక చేయగలరా? ఈ ప్రశ్నకు సమాధానం, పని రెండూ కొంచెం కష్టమైనవే. వంకాయలోకి పురుగు ఎలా వెళుతుంది? ఈ సారి పుచ్చు వంకాయ కోసినప్పుడు జాగ్రత్తగా గమనించండి. పురుగు ప్రత్యేకంగా ఏర్పరచుకున్న గాడిలో ఉంటుంది. నిజానికి ఈ గాడి పురుగు నోటి నుండి వచ్చిన జీర్ణ రసాలు గుజ్జును జీర్ణం చేయటం వలన ఏర్పడింది. శరీరం బయట జీర్ణమైన ఆహారాన్ని తీసుకుంటూ పురుగు ముందుకు కదులుతుంది.

ఈ మాత్రం కష్టపడటం ఎందుకు అనే బద్ధకపు జీవులూ ఉన్నాయి. భూమ్మీద - అన్నట్లు భూమ్మీద కాదు - జంతువుల పేగుల్లో, రక్తంలో కణ జాలాలలో అలాగే మానవునిలో కూడా

దాదాపుగా 20 అడుగుల పొడవుండి మన పేగులో నివసించే బద్దెపురుగు, ఇరవై సెంటీమీటర్ల పొడవుండే గుండ్రని పురుగు వంటి వందల జాతుల పరాన్న జీవులు ఇతర జీవుల పేగు గోడలను అంటిపెట్టుకుని నివసిస్తున్నాయి. పూర్తిగా జీర్ణమైన శోషించుకోవటానికి సిద్ధంగా ఉన్న ఆహారాన్ని శరీరపు గోడల ద్వారా పీల్చుకుంటాయి. ఇక వీటిలో నోరు జీర్ణ వ్యవస్థ వంటివాటి అవసరంలేదు. బద్దెపురుగులో ఇవి పూర్తిగా లోపించాయి. అనవసరపు భారాన్ని ప్రకృతి భరించదు. పేగులోని జీర్ణ రసాలు తమను జీర్ణం చేయకుండా ఈ జీవులు 'ఏంటి ఎంజైమ్స్' ను ఉత్పత్తి చేస్తాయి.

సముద్రపు అఖాతాలలో నివసించే గాలం చేప (Anglerfish) లలో ఆడచేప మగచేప కంటే వందల రెట్లు పెద్దదిగా ఉంటుంది. సంఖ్యాపరంగా ఇవి చాలా తక్కువ. సరియైన జంటను వెతుక్కోవటంకూడా కష్టమే. ఆడచేప కనపడగానే మగచేప ఆడచేపను అంటిపెట్టుకొంటుంది. ఆడచేప నుండి తనకు కావలసిన ఆహారాన్ని గ్రహిస్తుంది. ప్రత్యుత్పత్తి అవయవాలు మినహా మిగిలిన అవయవాలన్నీ క్షీణిస్తాయి. మగచేప దాదాపు ఆడచేప శరీరంలో ఒక భాగమై పోతుంది. ఆడచేప గ్రుడ్లను ఫలదీకరించటమే మగచేప పని.

ఈ ప్రసంగం మొదలు పెట్టేటప్పుడు మీరేం తిన్నారు? అంటూ ప్రశ్న వేశాను. అదే ప్రశ్న నెమరు వేసే జంతువును వేశామనుకోండి. ఏం సమాధానం వస్తుంది. సమాధానం మీరూ చెప్పగలరు, గడ్డి అని. కాని నెమరు వేసే జంతువులు గడ్డి కంటే ఎక్కువ సూక్ష్మజీవులను తింటాయి. నేను 'జోక్' చేస్తున్నాననుకుంటున్నారా? లేదండీ, ఇది అక్షరాల నిజం. ఈ విషయం నిరూపించాలంటే నెమరు వేసే జంతువుల జీర్ణాశయంలోకి తొంగి చూడాల్సిందే. ఆవు, మేక వంటి జంతువులలో జీర్ణాశయం నాలుగు భాగాలుగా ఉంటుంది. మొదటి 'రూమిన్' అనే ప్రథమ ఆమాశయంలో ఘన అంగుళానికి 15 నుండి 20 వేల మిలియన్ల బ్యాక్టీరియా ఉంటాయి. పశువులు తినే గడ్డిలోని 'సెల్యులోజ్' అనే పీచు పదార్థాన్ని జీర్ణం చేసి, దాని నుండి పిండిపదార్థాలు, గ్లైకోజిన్ మొదలైన వాటిని తయారు చేస్తాయి. సూక్ష్మ జీవులు ఈ పదార్థాలతో తమ శరీరాన్ని నిర్మించుకుంటాయి. ఈ బ్యాక్టీరియాలు నాల్గవ ఆమాశయంలోకి ప్రవేశించినప్పుడు అక్కడి ఆమ్లం వాటిని చంపేస్తుంది. (ప్రోటీన్ల) మాంస కృత్తులను ఆవు జీర్ణం చేసుకుంటుంది. గ్లూకోజ్, అమైనో ఆమ్లాలు నేరుగా శోషించబడతాయి. ఈ సూక్ష్మజీవులను జీర్ణం చేసుకోవటం వలనే ఆవు మేసేగడ్డిలో (ప్రొటీన్లు) మాంసకృత్తులు లేకపోయినా వాటికి ఇబ్బంది ఉండదు.

ఇప్పటికి చాలా సార్లు హైడ్రోక్లోరిక్ ఏసిడ్ - అదే ఉదజహరికామ్లం అనే పదం వాడాం. మనం 'ఏసిడ్' ఉత్పత్తి చేయటం ఏమిటి? అని మీకు అనుమానం వచ్చి ఉంటుంది. కాని ఈ 'ఏసిడ్' ప్రభావం మీరు రోజూ అనుభవిస్తున్నారు. ఎలాగో కొంచెం వివరిస్తాను.

రోజు మనకు నియమిత సమయానికి ఆకలేస్తుంది. ఆకలేసినపుడు వెంటనే ఏదైనా తినకపోతే ఆకలి మంట ఎక్కువవుతుంది. ఈ ఆకలి వేయటానికి కారణం జీర్ణాశయంలో ఉత్పత్తి అయేహైడ్రోక్లోరిక్ ఆమ్లమే.

మనకు ఎప్పుడైనా వాంతి అయినపుడు లేదా త్రేన్పుతో పాటుగా కడుపులో పదార్థాలు నోటి దాకా వచ్చినపుడు గొంతు మంట అనిపించటం అందరికీ అనుభవంలోని విషయమే. ఈ మంటకు కారణం జీర్ణాశయంలోని ఆమ్లమే.

మనం సూక్ష్మ జీవుల సంఖ్య మరీ ఎక్కువగా ఉన్న కుళ్ళిన ఆహారపదార్థాలు కాని లేదా కలుషితమైన నీటిని గాని తీసుకున్నామనుకోండి. సూక్ష్మ జీవులను ఏసిడ్ పూర్తిగా చంపలేదు. అవి ప్రేగులలోకి చేరి 'గాస్ట్రో ఎంటరైటిస్', 'కలరా' వంటి వ్యాధులకు దారి తీస్తాయి.

మానవులు రోజుకు ఎన్ని సార్లు తినాలి అని మొదట్లో మనం చర్చించాం. ఎవరైనా అదే పనిగా తింటుంటే 'మేక లాగా నములుతున్నాడంటారు' - శాకాహారులు ఎక్కువ ఆహారం తీసుకుంటేగాని వాటికి సరిపోయే పోషకాలు లభ్యం కావు. శాకాహారులు తీసుకునే ఆహారం జీర్ణం చేయటానికి వాటికి పొడవైన జీర్ణ నాళం అవసరం.

అదే మాంసాహారులైతే వాటి ఆహారంలో జీర్ణం కాని వ్యర్థ పదార్థాలు తక్కువ. అందువలన వాటికి పొట్టి ఆహారనాళం సరిపోతుంది.

మనం మాంసాహారం తీసుకుంటే అది శరీరంలో 72 గంటల పైగా ఉంటుంది. అదే శాకాహారం అయితే 48 గంటలలో జీర్ణం కాగా మిగిలినది బయటకు వెళ్ళిపోతుంది. మన శరీర నిర్మాణం శాకాహారానికి అనువుగా ఉంటుంది.

ఆహారం జీర్ణం చేసుకోవటంతోనే సమస్య తీరిపోలేదు. జీర్ణం కాని పదార్థాలను విసర్జించటమూ ముఖ్యమే. అన్ని జీవులలోనూ జీర్ణం కాని పదార్థాం పురీషనాళంలో కొంత కాలం నిల్వ ఉంటుంది. ఇక్కడ నీరు పురీష నాళపు గోడల చేత పీల్చుకోబడి మల పదార్థం గట్టి పడుతుంది. విసర్జించటానికి సరిపోయినంత పదార్థం పురీషనాళంలోకి చేరగానే పాయువు ద్వారా బయటకు పంపబడుతుంది.

ఈ మల పదార్థం ఒక్కో జంతువుకూ ఒక్కోరకంగా ఉంటుంది. మల పదార్థాన్ని బట్టి అది ఏ జంతువుదో మనం గుర్తించవచ్చు. వేటగాళ్ళకూ, జంతువుల సంఖ్య లెక్క చూసే శాస్త్రజ్ఞులకూ ఈ మల పదార్థం సరైన సమాచారం అందిస్తుంది. అలాగే డాక్టర్లకు కూడా రోగి మల పరీక్ష కావలసిన సమాచారం అందిస్తుంది.

అమీబా నుండి మానవుని వరకూ జీవులలో జీర్ణక్రియా విధానాన్ని స్థూలంగా చర్చించాం కదా. అన్ని జీవులలో ఒకే విధమైన జీర్ణ రసాలుండటం, జీర్ణ క్రియా విధానం ఉండటం, జీవులు క్రమగతిలో అభివృద్ధి చెందాయని నిరూపితమౌతుంది. జీవ పరిణామ సిద్ధాంతం జరిగినదనటానికి ఇదీ ఒక నిదర్శనమే.

'ఆత్మవత్ సర్వభూతాని' అన్నారు ఋషులు.

అంటే అన్ని జీవులలోని ఆత్మ ఒకటే అని.

అన్ని జీవులలోని ఆత్మ ఒకటి అవునో కాదో కాని, అన్ని జీవులలోనూ జీర్ణక్రియ మాత్రం ఒకటే.

(ఆకాశవాణి అనంతపురం కేంద్రం ద్వారా ప్రసారితం)

# ఫాల్‌స్టాఫ్-నీమ్‌చంద్-గిరీశం

- డా. యు.ఎ. నరసింహమూర్తి

దీనబంధు మిత్ర రాసిన ''సధవర్ ఏకాదశి'' (1866)లో 3 అంకాలు, 9 రంగాలు, 15 పాత్రలు, ఇంకా కొన్ని చిల్లర పాత్రలు ఉన్నాయి. ఈ నాటకం బెంగాలి నాటక సాహిత్యంలో ఒక కళాఖండమని చెప్పాలి. నిబిడమైన ఇతివృత్తం, తీర్చిదిద్దిన పాత్రలు, ఆసక్తికర సన్నివేశాలు, వినోదభరితమైన సంభాషణలు, చతురోక్తులు, హాస్యోక్తులు, వ్యంగ్యోక్తులు, అధిక్షేపాలతో నిండిన ఈ నాటకం అంతటా ఒక విలక్షణమైన కారుణ్యం అంతర్వాహినిగా ఉంటుంది. మనలను ఆశ్చర్యంలో ముంచెత్తే వాస్తవికత, సామాజిక నిబద్ధత ఈ నాటకంలోని ప్రధానాంశాలు. 19వ శతాబ్ది ఉత్తరార్థం నాటి కలకత్తా నగరంలోని విలక్షణ వ్యక్తిత్వం గల వ్యక్తులు ఈ నాటక సన్నివేశంలో కనిపిస్తారు. ఇటువంటి వ్యక్తులలో మైఖేల్ నీమ్‌చంద్ దత్తు ప్రధానుడు.

19వ శతాబ్ది ఉత్తరార్థంలో బెంగాలీ నాటక రంగంలో పేరు ప్రఖ్యాతులను సంపాదించిన మహానటులు నీమ్‌చంద్ పాత్రను ధరించడానికి తహతహ లాడేవారు. ఈ పాత్ర అద్వితీయమైనది, సాటిలేనిది. బెంగాలీ నాటక రంగంలో నేటివరకు తిరిగి అంతటి పాత్ర సృష్టి జరుగలేదు. బహుభాషావేత్త, మేధావి, కవి అయిన మైఖేల్ మధుసూదన దత్తును దృష్టిలో పెట్టుకొని దీనబంధుమిత్ర నీమ్‌చంద్ పాత్ర సృష్టించాడని అందరూ అనుకొంటారు. మైఖేల్ జిహ్వాగ్రం మీద ప్రముఖ ఆంగ్ల సాహిత్య సారమంతా తృళ్ళింత లాడేది. అతడు మద్యపాన ప్రియుడు, సాంప్రదాయ బంధాలనన్నింటిని త్రెంచుకొని స్వేచ్ఛా విహారం చేయాలనుకొనే ఆనాటి బెంగాలీ యువకులందరకీ ప్రతీకగా నిలచినవాడు. ఈ లక్షణాలన్నీ నీమ్‌చంద్‌లో కనిపిస్తాయి. అంతేకాదు, నీమ్‌చంద్ ఇంటిపేరు మైఖేల్. కానీ దీనబంధు మిత్ర మైఖేల్ మధుసూదన దత్తు తన పాత్రకు ప్రేరణ అని ఎప్పుడూ అంగీకరించలేదు. మధువు కటువుగా ఎలా ఉంటుందని ప్రశ్నించాడు? (can Madhu (honey) ever be neem (bitter).

నీమ్‌చంద్ ఒక మామూలు తాగుబోతు. ప్రధాన పాత్ర అయిన అతుల్, అతని బృందం రోత పుట్టించేంత చెడు లక్షణాలు కలిగినవారు. ఆ బృందంలో ఒకడుగా నీమ్‌చంద్ పరిచయమౌతాడు. క్షణాలలో దృశ్యానికి ప్రాణ స్పందనగా మారి, సమయానికి అతుక్కునేలా షేక్స్పియర్, డ్రైడన్, మిల్టన్, హోప్‌ల రచనల లోంచి ధారాళంగా ఉదాహరణలనిస్తూ, జీవితం పట్ల ఒక నిర్లక్ష్య భావాన్ని ప్రదర్శిస్తూ (Devil - may - care attitude towards life) సిగ్గూ - ఎగ్గూ వదలిన పరాన్నభుక్కుగా, మోసకారితనంతో మిగిలిన పాత్రలన్నింటికంటే ఎంతో ఎత్తుగా ఎదిగిపోతాడు. ఎవరికీ ఉపయోగపడేవాడు కాడు. తనను తాను సంస్కరించుకోవాలనే ఉద్దేశ్యం అతనికి ఎన్నడూ లేదు. అతను ప్రదర్శించిన నిజాయితీ అంతా విరోధాభాసగా కనబడుతుంది. నాటకాంతంలో మర్యాదస్థులైన గృహిణులను పాడుచేయడానికి ప్రయత్నించి పతనమైన అతుల్‌ను అతను మందలిస్తాడు. 'సధవర్ ఏకాదశిని' పతనం పొందుతున్న తరాన్ని లోకానికి వెల్లడించే నాటకంగా మనం అంగీకరిస్తే తన ప్రవర్తన సరళిలోని దోషాన్ని గురించి ఏ మాత్రం గ్రహించలేని విచక్షణ జ్ఞాన శూన్యమైన ఆతరానికి నీమ్‌చంద్‌ను ఆత్మస్థానీయుడుగా గుర్తించాలి.

---

డా॥ యు. ఎ. నరసింహమూర్తి మహారాజా కళాశాలలో తెలుగు శాఖాధ్యక్షునిగా పదవీ విరమణ చేశారు, విజయనగరం.

నీమ్‌చంద్‌ను గూర్చి అతని మాటలలోనే చెప్పాలంటే "Came out of school an angel, and now turned into devil". హిందూ కళాశాల ఉపన్యాసకుడైన డెరోజియాను, అతని విద్యార్థి బృందాన్ని ఈ పాత్ర సూటిగా వేలెత్తి చూపిస్తోంది. డెరోజియా అనుయాయులైన బెంగాలీ యువకులు హిందువుల ఆహార విధానాలను వ్యతిరేకించారు. మద్యపానం, మాంసభోజనం, వ్యభిచరించడం వారి దృష్టిలో నేరాలు కావు. పాశ్చాత్య సంప్రదాయంలో పరిపూర్ణమైన విద్యా సముపార్జన చేసినవాడు, ఏది ఏమైనా పాశ్చాత్య శిక్షణ రీతిలో స్త్రీలను గౌరవించడం మాత్రం వారు నేర్చుకొన్నారు. నీమ్‌చంద్ పాత్రలో ఈ గుణ గణాలన్నీ కనిపిస్తాయి. ఇష్టంలేని వివాహం కారణంగా నీమ్‌చంద్ మద్యానికి బానిసయాడు. యువతీయువకుల ఇష్టానికి వ్యతిరేకంగా తల్లిదండ్రులు పెళ్ళిళ్లను నిర్ణయించడం, స్త్రీలను విద్యకు దూరం చేయడం అనే సామాజిక దురాచారాల పట్ల తన వ్యతిరేకతను ప్రదర్శిస్తూ దీనబంధుమిత్ర ఈ పాత్రను సృష్టించాడు. 'సధవర్ ఏకాదశి' అనే దుఃఖాంత నాటకం ఐహిక వ్యాపారాలనే ఊబిలో కూరుకుపోతూ తన ఉనికిని కాపాడుకోవాలనుకొనే ఒక మధ్యతరగతి ఆత్మ తనకు తాను నిలదొక్కుకోడానికి శక్తి చాలక తనలో మిగిలిన కాస్తంత శక్తిని కూడదీసుకొని తనకు తాను నాశనం చేసుకొనే దిశగా త్వరితగతిని చేసిన ప్రయాణాన్నే అభివర్ణిస్తుంది.

Nimchand is a Shakes pearean character, a truly "lovable rogue" like Falstaff, and yet owing nothing to any other character in the theatre" అని ఆచార్య దత్తాత్రేయ దత్ వ్యాఖ్యానించేరు. ప్రతినాయక పాత్రలో నీమ్‌చంద్ ''అవాలేర్ ఘరేర్ దువాల్'' లోని ''థాక్ బాబా''కు, హాస్యధోరణిలో ఠాగూర్ సృష్టించిన ''చిరకుమార్ సభ'' లోని అక్షయ్‌కు ప్రతిద్వందిగా నిలచినవాడని కూడా ఆయన పేర్కొన్నాడు. ఆధునిక బెంగాలీ నాటకం శైశవదశలో ఉన్నప్పుడే ఇటువంటి అద్భుతమైన పాత్రను సృష్టించడం దీనబంధు మిత్ర ప్రజ్ఞకు నిదర్శనంగా కనిపిస్తుంది.

19వ శతాబ్ది భారతీయ నాటక సాహిత్యంలో మూడు అద్భుతమైన పాత్రల సృష్టి జరిగింది. కాలక్రమాన్ననుసరించి అందులో మొదటి పాత్ర నీమ్‌చంద్ (1860); రెండవ పాత్ర దల్‌పత్‌రామ్ గుజరాతీ భాషలో సృష్టించిన ''మిథ్యాభిమాన్'' నాటకంలోని జీవరామ్ భట్ (1870); మూడవది 'కన్యాశుల్కం'లోని గిరీశం పాత్ర (1872). నాటకీయ ప్రజ్ఞ ననుసరించి చూస్తే ఈ పాత్రలలో మొదటి స్థానం గిరీశానికి దక్కుతుంది. గిరీశం పాత్రలో ఎన్నో పార్శ్వాలు కనిపిస్తాయి. అది ఏక ముఖంగా కొనసాగే పాత్ర కాదు. అంతటి సంక్లిష్టమైన పాత్ర 19వ శతాబ్ది భారతీయ నాటకంలో ఇంకొకటి లేదు. నీమ్‌చంద్‌కు, గిరీశానికి కొన్ని పోలికలున్నాయి. కొన్ని వైరుధ్యాలున్నాయి.

దీన బంధు మిత్ర, గురజాడలపై గల షేక్స్పియర్ ప్రభావం కారణంగా కొందరు విమర్శకులు నీమ్‌చంద్, గిరీశాలిద్దరిలోను ఫాల్‌స్టాఫ్ లక్షణాలను చూసేరు. వీరిద్దరిలోను ఆ లక్షణాలలో కొన్ని కనిపించడం వాస్తవం. కానీ అస్సామీ నాటక కారుడైన బెజ్‌బారువ తన ''చక్రధ్వజ సింహ'' అనే చారిత్రక నాటకంలో సృష్టించిన గజపూరియా అనే పాత్ర సృష్టిలో ఫాల్‌స్టాఫ్ పాత్రకు మక్కికి మక్కి అనుకరణలు కావు. ఆ పాత్ర నుండి స్ఫూర్తిని పొందినది మాత్రమే.

ఫాల్‌స్టాఫ్ జీవ లక్షణాన్ని గూర్చి తనకు తానే

*"I am not only witty in myself*
*But the cause that wit is in other men."*
(In king Henry IV, part 2, act 1, Scene 2) లో చెప్పుకొన్నాడు.

ఫాల్‌స్టాఫ్ ముసలివాడు, స్థూలకాయుడు, బద్ధకస్థుడు, స్వార్థపరుడు, అవినీతిపరుడు, నిజాయితీలేని వాడు, దొంగ, బమ్మిని తిమ్మి - తిమ్మిని బమ్మిని చేయగలవాడు, ప్రగల్భాలు పలికేవాడు, కాముకుడు, ఇన్ని విరుద్ధ లక్షణాలున్నా షేక్స్పియర్ సృష్టించిన హాస్యపాత్రలన్నింటిలో అత్యంత ప్రసిద్ధమైన పాత్ర ఫాల్‌స్టాఫ్. ''హెన్రీ ది ఫోర్త్'' నాటకంలోని స్థితి ననుసరించి ఫాల్‌స్టాఫ్ ఆభిజాత్య సంపన్నుడైన యోధుడు (Knight). కానీ ఆయన స్వభావం అందుకు విరుద్ధంగా కనిపిస్తుంది. మధ్యయుగాల నాటి యోధుల లక్షణాలుగా ప్రసిద్ధములైన ధైర్యం, మర్యాద, గౌరవం, విశ్వాస పాత్రత, బలహీనులు- నిస్సహాయులయిన వారిపట్ల అంకిత భావం, స్త్రీజన సంరక్షణ అనే మంచి లక్షణాలు ఫాల్ స్టాఫ్‌లో కాగడా వేసి వెతికినా కనబడవు. ఫాల్‌స్టాఫ్ డబ్బుకోసం, విలాసాల కోసం దారిదోపిడీలు చేస్తాడు. "Can humour set - to a leg? No or an arm? No or take alway the grief of a wound? No.....what is humour? A word. (560 - 160 - 130 - 133) అన్న ఫాల్‌స్టాఫ్ గౌరవం కోసం ఎప్పుడూ ప్రాకులాడ లేదు. అతనికి సిగ్గు - ఎగ్గులు లేవు. ఇన్ని దుర్లక్షణాలున్న పాత్ర అయినా ఫాల్‌స్టాఫ్‌ను షేక్స్పియర్ ప్రేక్షకులు వేనోళ్ల కొనియాడారు. ఇందుకు రెండు కారణాలు కనిపిస్తాయి. నీతినియమాలను వదలుకొన్న వికృత వ్యక్తిగా తనకు తానే సాటి అనిపించుకోవడం. దారి దోపిడీలు చేసిన సందర్భంలో కూడా అతనికి అవమానమే మిగిలింది. జీవితంపట్ల అతనికి గల ప్రగాఢ వ్యామోహం కారణంగా ఫాల్‌స్టాఫ్ ఎప్పుడూ మర్యాదను తెగనాడుతున్నట్లుగా కనిపిస్తాడు. చమత్కార సంభాషణ చేసే సందర్భం తటస్థించినప్పుడు, విందుభోజనం దొరికినపుడు మర్యాద మప్పితాలు అతనికి ఎందుకూ కొరగానివిగా కనిపిస్తాయి. ఫాల్‌స్టాఫ్ తాను ఉపయోగించే భాషలోంచే ఆవిర్భవించేడు. ఫాల్‌స్టాఫ్‌ను "a creature of words" అన్నారు. ఫాల్‌స్టాఫ్ బుకాయింపులు, అబద్ధాలే అతని ఆకర్షక శక్తులు.

ఫాల్‌స్టాఫ్, నీమ్‌చంద్, గిరీశాల మధ్య ఒక వింత పోలిక కనిపిస్తుంది. ఫాల్‌స్టాఫ్ కేవలం కల్పిత పాత్ర కాదని, Sir John Fastoly అనే చారిత్రక వ్యక్తి ప్రేరణగా సృష్టించిన పాత్ర అని షేక్స్పియర్ చెప్పుకున్నాడు. దీనబంధు మిత్రకు సమకాలికులనేకులు నీమ్‌చంద్ పాత్ర మైఖేల్ మధుసూదన దత్ పాత్రకు వ్యంగ్య చిత్రణ అని పేర్కొన్నారు. మిత్ర స్వయంగా ఆ అభిప్రాయం సరికాదని ప్రకటించినా అనేకులకు ఆ అభిప్రాయం తొలగిపోలేదు. గిరీశం పాత్రకు మూలాలను అన్వేషించే కుతూహలం కల కొందరు గురజాడకు సమకాలికంగా నిష్టల చలపతి అనే వ్యక్తి విజయనగరం మహారాజావారి సంస్థానంలో ఉద్యోగిగా ఉండేవాడని, ఆయనను చూసి గురజాడ గిరీశం పాత్ర సృష్టించాడని అన్నారు. చలపతి అనే పదాన్నే గిరీశంగా మార్చాడని కూడా వారి అభిప్రాయం. ఇది ఊహ మాత్రమే కానీ వాస్తవం కాదు.

నవకుమార్‌బాబు లాగే నీమ్‌చంద్ కూడా గిరీశం మూలపురుషులలో ఒకడు. నీమ్‌చంద్, గిరీశం డెరోజియన్లు, యువకులు, ఇంగ్లీషు బాగా చదువుకొన్నవారు, సంస్కరణ ప్రయత్నమేదీ

చేయకుండానే సంస్కరణవాదం గురించి ప్రసంగాలు మాత్రం చేస్తూ ఉంటారు. భారతదేశంలో 19వ శతాబ్ది ఉత్తరార్థంలో పెచ్చురేగిన అరాచక సంస్కృతికి సృష్టికర్తలైన యువమేధావులకు వీరు ప్రతినిధులు. ఈ ఇద్దరిలోనూ ఖల్‌నాయక్ (Anti Hero) లక్షణాలున్నాయి. ఫాల్‌స్టాఫ్ లాగే అనుపదము, అనుక్షణమూ హాస్య సృష్టి చేయగలవారు, హాస్య సృష్టిని ప్రేరేపించగలవారు. ఫాల్‌స్టాఫ్ చుట్టూ ఒక బృందం ఉన్నట్లే నీమ్‌చంద్‌కు కూడా అనుచర బృందం ఒకటుంది. గిరీశానికి వెంకటేశం ఒక్కడే అనుచరుడు. ఫాల్‌స్టాఫ్ ప్రిన్స్‌హాల్‌ను, గిరీశం వెంకటేశాన్ని ప్రయోజనం కోరి అనుసరించేరు. నీమ్‌చంద్ అలా ఏ ప్రయోజనాన్నీ కోరలేదు. ఫాల్‌స్టాఫ్ దురాశాపరుడు, గిరీశం ఆశావాది, నీమ్‌చంద్ నైరాశ్యంలో మ్రగ్గినవాడు. ఫాల్‌స్టాఫ్, నీమ్‌చంద్ లిద్దరూ త్రాగుబోతులు. చుట్ట కాల్చడంలో గిరీశం వారి సరసన నిలుస్తాడు. సిగ్గూ - ఎగ్గూ వదలిపెట్టడంలోను, పరాన్న భుక్కులు కావడంలోను, మోసకారితనంలోను ముగ్గురూ ముగ్గురే. నీమ్‌చంద్, గిరీశం దొంగతనం ముద్ర వేయించుకొన్న వారైనా ఫాల్‌స్టాఫ్‌లా దారిదోపిడీలకు పాల్పడిన వారు కాదు. వారిలో పిరికి తనం లేదు. ఎవరికీ ఉపయోగపడక పోవడంలో కూడా వీరి మధ్య పోలిక కనిపిస్తుంది. ఫాల్‌స్టాఫ్ లాగే గిరీశం కాముకుడు. నీమ్‌చంద్ కూడా విచ్చల విడిగా ప్రవర్తించినా మర్యాదస్థులైన గృహిణులను పాడు చేయడానికి ప్రయత్నించిన తన మిత్రుడు అతుల్‌ను మందలిస్తాడు. గిరీశం బుచ్చమ్మను పాడుచెయ్యకూడదని ఆమె విషయంలో కొంచెం మర్యాదకరమైన విధానాన్ని అనుసరించాలని భావించి, తన కాముక లక్షణాన్ని నిరోధించుకోవడంలో నీమ్‌చంద్ లక్షణం కొంత కనిపిస్తుంది. దేవతలా ప్రవేశించి దయ్యంలా ముగిసిన పాత్ర నీమ్‌చంద్‌ది, దయ్యంలా ప్రవేశించి దేవతలా నటిస్తూ దయ్యంగానే తెరమరుగైన పాత్ర గిరీశానిది. రెండూ విషాదాంత పాత్రలే. ఎదుటివారిని భ్రమగొల్పడంలో గిరీశం వీరిద్దరి కంటే రెండాకులు ఎక్కువ చదివాడు.

నీమ్‌చంద్, గిరీశం మధ్య ఇంకొక ముఖ్యమైన పోలిక ఉంది. అది ఆంగ్ల రచనలలోంచి ఉదాహరణల నిస్తూ, సంభాషణలు కొనసాగించడం. సంభాషణలో మాతృభాషా పదాలతో తరచూగా అతికినట్లుగా ఆంగ్లభాషా పదాలను వాడడంలో గిరీశానికి నవకుమార్ బాబు గురువైతే, అడపా దడపా తడుముకోకుండా ఆంగ్ల రచనలలోంచి వాక్యాల నుదహరించడం, జాతీయం చెడకుండా ఆంగ్లపదబంధాలను ఉపయోగించడంలో నీమ్‌చంద్ అతనికి మార్గదర్శి అని నిస్సందేహంగా చెప్పవచ్చును. దీనబంధు తన రచనలలో తరచుగా ఇంగ్లీషు వాక్యాల నుదాహరించేడు. 1872లో రాసిన Jamai - Barik లో ఈ క్రింది చరణాలు కనిపిస్తాయి. "of all the elessings on earth the best is a good wife. A bad one is the litterest Curse of human life" కమలే కామినీ (Kamale - Kamini 1873) అనే నాటకం మొదట్లో

Dun : Dismay'd not this our captains, Macbeth and Banvuo?

Sold : Yes! as sparrows, eagles : or the hare, the lion." అన్న మేక్‌బెత్‌లోని చరణాలు కనిపిస్తాయి. లీలావతి నాటకంలో కూడా కొన్ని ఉదాహరణ వాక్యాలు ఉన్నాయి. అన్నింటిలో కంటే 'సధవర్ ఏకాదశి'లో నీమ్‌చంద్, డ్రైడెన్, మిల్టన్, హోప్, షేక్స్పియర్‌ల రచనల నుండి నోరిప్పినప్పుడల్లా ధారాళంగా వాక్యాలకు వాక్యాలు ఉదాహరిస్తూ ఉంటాడు. ఇది

ఆ పాత్ర ప్రత్యేక లక్షణంగానూ, ఆ నాటక విజయానికి గల ప్రముఖ కారణంగానూ బెంగాలీ విమర్శకులు గుర్తించారు. ప్రముఖ నటుడైన ఒక్క అమృతలాల్ బసు మాత్రమే ఎల్లవేళలా తప్పతాగి పడి ఉండే నీమ్‌చంద్ నోటి నుండి మహాకవుల వాక్యాలు నిర్దుష్టంగా, ధారాళంగా వెలువడడం అసంభవమని నిరసిస్తూ ఆపాత్రను అభినయించడానికి వ్యతిరేకించాడు. సధవర్ ఏకాదశి "Unconscious germ of the public stage" అని విమర్శించాడు.

కన్యాశుల్కంలో దుష్ట పాత్రగా పేరుపడిన రామప్పంతులు ఒక్కడు మాత్రమే గిరీశానిది ''బొట్లేరింగ్లీషు'' ని హేళన చేసాడు. ఇతరులెవ్వరూ ఆమాట అనలేదు. ''గురజాడ అప్పారావుకి వాడుక (తెలుగు) భాష ఎంత ''కొట్టిన పిండో'' గిరీశానికి వాడుక (ఇంగ్లీషు) భాష అంతే అని చెప్పుకోవచ్చును. వినేవాడికి ఏ మాత్రం ఇంగ్లీషు పరిజ్ఞానం ఉన్నా (ఉందని అతను అనుకొన్నా) గిరీశం తన మాటల్లో కొంచెం ఇంగ్లీషు ప్రయోగించక మానడు. "Idiotic English కాదు; Idiomatic English" అన్న భరాగో మాటను ఎవరూ కాదనలేరు. నీమ్‌చంద్ ఉదాహరించిన డ్రైడన్, హోప్, మిల్టన్, షేక్స్పియర్‌లు ఆంగ్ల సాహిత్యంలో అత్యంత ప్రసిద్ధులు, అది గమనించిన గురజాడ ఆంగ్లసాహిత్యంతో తనకు గల విస్తృత పరిజ్ఞానాన్ని ప్రకటిస్తూ Poor Richard, Goldsmith, John Gey, Jane Teylor, Ann Taylor, John Milton, Shakespeare వంటి వారి రచనల నుండి గ్రహించిన వాక్యాలను సన్నివేశానికి అతికినట్టుగా గిరీశం నోట సమర్థంగా పలికించాడు. "Two birds at one shot, Never do by halves, Throwing pearls before science, Make hay while the sun shines", వంటి లోకోక్తులనే కాక ఆంగ్ల జాతీయాలను, పద బంధాలను కూడా గిరీశం అత్యంత సమర్థంగా ప్రయోగించి నవకుమార్‌బాబు, నీమ్‌చంద్‌ల కంటే ఒక అడుగు ముందుకు వేసాడు. Asses' Bridge, Grend Dutchy of Baden వంటి అర్థవంతమైన అపూర్వ ప్రయోగాలు చేసి తన వైదుష్యాన్నే చాటుకొన్నాడు. Asses' Bridge కట్టడమంటే (To make an ass of one's self), to do or say something very foolish or absurd అని అర్థం. Baden అనే ప్రాంతానికి Dutchess అంటూ ఉండదు. Dutchess లేనప్పుడు grend dutchy అసలే ఉండదు. మొత్తం మీద Grend Duthcy of Baden అనే ప్రయోగానికి ఏమీలేదని, అంతా అబద్ధమని అర్థం.

నవకుమార్ బాబు, నీమ్‌చంద్‌ల సంభాషణలు బెంగాలీ సాహిత్యంలో ఏవిధంగా ఒక నూతన శకాన్ని ఆరంభించాయో, తెలుగు నాటకానికి గిరీశం సంభాషణలు కూడా అదే విధంగా కొత్త దనాన్ని అందించాయి. అంతేకాదు కన్యాశుల్కం ప్రభావంతో టి.పి. కైలాసం వంటివారు తమ నాటకాలలో ''కన్నడాంగ్ల'' పదబంధాలను వాడుక చేసారు.

బెంగాలీ నాటక సాహిత్యంలో నీమ్‌చంద్ లాగ తెలుగు నాటక సాహిత్యంలో గిరీశం పాత్ర అజరామరమైంది. ప్రముఖ బెంగాలీ నటులందరు నీమ్‌చంద్ పాత్రను అభినయించడానికి తహతహ లాడినట్లే, తెలుగు నటులు కూడా గిరీశం పాత్రను అభినయించడం తమ నటనా సామర్థ్యానికి గీటురాయిగా భావించారు. ఆంగ్లభాషా ప్రయోగంతో నిండిన గిరీశం స్వగతాలను తెలుగు సాహిత్యాభిమానులు కంఠపాఠం చేసారు. న్యాయంగా గిరీశానికి లభించిన ఖ్యాతిలో కొంత భాగం నీమ్‌చంద్‌కు దక్కవలసి ఉంది.

# శరత్ జ్యోత్స్న కాంతులు - విషలర్ చిత్రాలు

- కాంద్రేగుల నాగేశ్వరరావు

ఆమె శరత్కాలపు మేఘం. చందమామ లాంటి స్ఫటిక శిల, రాజహంస, మల్లెలదండ, మంచు వాన, అలల నురుగు, వెండిమెరుపు, హిమగిరులు, తెల్ల తామరపువ్వు, పాల సముద్రం - చదువుల తల్లి సరస్వతీ దేవిని తెలుపు రంగు స్వచ్ఛతతో పోలుస్తూ బమ్మెర పోతన తన కావ్య గానంతో ఆమెను మొక్కాడు. అన్ని రంగులను, ఛాయలను తనలో నింపుకున్న శారదా వర్ణానికి తన చిత్రకళ ద్వారా నివాళులర్పించి చిత్రకళా ప్రపంచాన్ని నివ్వెర పరిచాడు, అమెరికన్ చిత్రకారుడయిన విషలర్ (Whistler).

ప్రాచీనకాలం నుండి ఈ నాటి వరకూ సప్త వర్ణాలతో కూడిన రాగమాలికలు అనేక మంది చిత్రకారుల చిత్రాలపై నాట్యమాడాయి. ఐరోపా చిత్రకారులు, ఎరుపు, నీలం రంగులకు, భారతీయ చిత్రకారులు కాషాయరంగు, కరక్కాయ నలుపు రంగులకు ఎక్కువ ప్రాధాన్యత నిచ్చారు. రంగుల చిత్రమంటే తెలుపు రంగును వీలయినంత వరకూ తక్కువ వాడటమనే భావన కల్పించారు. దీనికి విరుద్ధంగా, స్వచ్ఛతకు, శాంతికి చిహ్నంగా అలరారుతున్న తెలుపు రంగును తేజోమయమైన విస్ఫోటనగా కాన్వాస్ మీదకు తెచ్చిన ఘనత విషలర్‌దే.

విషలర్ 1834వ సంవత్సరంలో అమెరికాలోని మాసాచుసెట్స్ (Massachusetts) అనే రాష్ట్రంలో లోవెల్ అనే చోట జన్మించాడు. తండ్రి మిలటరీ ఇంజనీరుగా పని చేసి, ఆ పదవికి రాజీనామా చేసి రష్యాలోని పీటర్స్ బర్గ్ నగరానికి కుటుంబంతో వలస వెళ్ళాడు. అక్కడ జార్ చక్రవర్తి వద్ద రైల్వే ఇంజనీరుగా పనిచేసాడు. విషలర్ బాల్యమంతా అక్కడే గడిచింది. 10 సంవత్సరాల వయస్సులో అక్కడ వున్న ఇంపీరియల్ చిత్రకళా పాఠశాల నుంచి ప్రథమునిగా ఉత్తీర్ణుడయినాడు. విషలర్ తల్లి అయిన అన్నామథిల్డా (Anna Mathilda) సంప్రదాయవాది, నిష్ఠాగరిష్టురాలు, నైతిక వాది. తండ్రి జాడలోనే కొడుకు మిలటరీ ఉద్యోగి కావాలని ఆమె ఆకాంక్ష. చిత్రకళపై, చిత్రకారులపై ఆమెకు చిన్నచూపు. వీటన్నిటికి తోడూ భయంకరమైన రష్యా చలి బారి నుండి తప్పించుకోవడానికి కుటుంబాన్ని ఇంగ్లాండ్‌కు తరలించింది. అది జరిగిన మరసటి సంవత్సరమే భర్త మరణించాడు. అమెరికాకు తిరిగి వెళ్ళవలసిన ఆర్థిక పరిస్థితి ఏర్పడింది. అక్కడ మిలటరీ ఎకాడమీలో జేరిన విషలర్ అందరితోనూ గొడవ పెట్టుకొని, ఆ వాతావరణంలో ఇమడలేక రసాయనశాస్త్రంలో ఫెయిలై అకాడమీ నుండి బహిష్కరించబడ్డాడు. జీవితంలో పైకి రావడానికి ఉపయోగపడే అన్ని ద్వారాలూ మూసుకుపోయాయి. ఇక అతనికి మిగిలింది తాను ప్రేమించిన చిత్రకళ ఒక్కటే. 1855వ సంవత్సరంలో తల్లిని ఒప్పించి పారిస్ నగరం చేరుకున్నాడు. అక్కడ చిత్రకళలో మహామహోద్యమైన గుస్టావ్ కోర్బెట్ (Gustav Courbet) శిష్యుడైన చార్లెస్‌గ్లెయిర్ వద్ద చిత్రకళలో మెళుకువలను నేర్చి గురువును మించిపోయాడు. అతి త్వరలోనే ఫ్రెంచి భాషపై పట్టు సాధించాడు. పొట్టిగా, పీలగా వున్నా ప్రత్యేకంగా కనిపించే దుస్తులు వేసుకొని ఒకశైలిని అలవరచుకున్నాడు. దట్టమైన వంకీలు తిరిగిన జుట్టు, పాల భాగంలో బాల మెరుపు, వెడల్పుగా వుండి మధ్యలో రిబ్బను కట్టబడిన ఒక వెదురు అల్లిక టోపీ, ఒక కంటికి మాత్రమే అద్దాలు, పుల్ల విరచినట్లు మాట్లాడటం, మొరటు హాస్యం, ఇవి అతని భౌతిక లక్షణాలు. 1859 వ సంవత్సరంలో అతను తన సోదరిని, మేన కోడలును మోడల్‌గా పెట్టివేసిన 'పియానో వద్ద' అన్న చిత్రం పారిస్ గాలరీలో నిరాకరించబడినా ఇంగ్లండ్‌లోని రాయల్ అకాడమీ వారి గుర్తింపు పొందింది (4వ అట్టపై చిత్రం). ప్రీ రాఫెలైట్‌లలో ముఖ్యుడైన మిలేస్ ఈ చిత్రాన్ని

---

కాంద్రేగుల నాగేశ్వరరావు, హైదరాబాదు, కమర్షియల్ టాక్స్ శాఖలో అడిషనల్ కమీషనర్‌గా పదవీ విరమణ చేశారు. కళా సాహిత్యాలు అభిమాన విషయాలు.

ఎంతగానో మెచ్చుకున్నాడు. తాను ఆరాధించే మిలేస్ ఆ చిత్రాన్ని మెచ్చుకోవటం అతని కెంతో ఉత్సాహాన్నిచ్చింది. వెంటనే పారిస్ నుంచి ఇంగ్లండ్‌కు మకాం మార్చి తేమ్స్ నది ఒడ్డున ఒక స్టూడియోను అద్దెకు తీసుకొని చిత్రాలు గీయటం ప్రారంభించాడు. పియానో వద్ద అన్న చిత్రంలో పియానో పాటాన్ని వింటున్న తన మేనకోడలు తెల్లటిగౌనులో, తెల్లటి మేజోళ్ళతో నిలబడి వుంటుంది. తెలుపు రంగుతో అతని అనురాగానికి ఇది ప్రారంభ దశ. 1860 నాటికే అతను ఒక ముఖ్యమైన, ప్రతిభకలిగిన యువ చిత్రకారునిగా పేరు పొందాడు. క్రమేపీ స్నేహితులు పెరుగుతూ వచ్చారు. తాను ఆరాధించే ప్రీరాఫలైట్లయిన మిలేస్, రోజట్టేలు అతనికి ఆరాధకులుగా మారారు. ఆరోజులలో జపాన్ చిత్రకళ, తెలుపు రంగుతో శోభిల్లే జపాన్ పింగాణి వస్తువులు అతనిని ఎక్కువ ఆకర్షించాయి. సంపాదించిన డబ్బులో ఎక్కువ భాగం ఖరీదైన ఆ వస్తువులు కొనుగోలు చేయడానికే వెచ్చించాడు.

ఎఱుపు రంగు కలిగిన కురులతో, తెల్లటి మేని ఛాయతో, అత్యంత లావణ్యంగా శోభిల్లే జోనా ఎఫర్‌మాన్ అనే మోడల్‌తో అతనికి పరిచయం అయింది. 1860వ సంవత్సరంలోనే. అక్కడ నుండి 7 సంవత్సరాల వరకూ అతని చిత్రాలకు ఆమె ప్రేరణ, ఆలంబన, సర్వస్వం. 1863వ సంవత్సరంలో విషలర్ తల్లి ఇంగ్లండ్ వచ్చేంత వరకూ వారిద్దరి మధ్య వివాహేతర ప్రణయం యధేచ్ఛగా సాగింది. 'జో' (జోనా)ను స్టూడియోకు దగ్గరలో మరొక చోటికి మార్చాడు. ఒక నాడు విషలర్ తల్లి అనుకోకుండా స్టూడియోకు వచ్చి అక్కడ నగ్నంగా వున్న జోనాను చిత్రిస్తున్న కొడుకుని చూసి నిర్మాన్పడిపోయింది.

1861వ సంవత్సరంలో 'జో'ను మోడల్‌గా తీసుకొని అతను White Girl అనే చిత్రం వేశాడు. దీనిలో తెలుపు రంగులోని ఛాయ బేధాలను సున్నితంగా స్పృశించాడు. ఈ చిత్రం ఒక గొప్ప సంచలనం సృష్టించింది. Wilkie Collins అనే రచయిత వ్రాసిన The Woman in White అన్న నవలకు ఇది చిత్ర రూపమని ఇంగ్లండ్‌లో చాలా మంది భావిస్తే, ఫ్రెంచి దేశస్తులు అమె చేతిలో వున్న రేఖలు రాలిన లిల్లీ పువ్వు ద్వారా కన్యాత్వాన్ని పోగొట్టుకున్న ఒక విషాదమయ బాలికను చూశారు. అసలు ఇవేమీకావని ఇది తెలుపు రంగుకు తాను పట్టం గట్టిన ప్రయత్నమని ఈ చిత్రానికి White Girl అన్న పేరును మార్చి Symphony in White No.1 అన్న పేరును ఖరారు చేశాడు (1వ అట్టపై చిత్రం). తరువాత ఇదే శైలిలో Symphony in white No.2, No.3 అనే చిత్రాలు పరంపరగా వేశాడు. అతని మొదట వేసిన చిత్రం కంటే అతను వేసిన రెండవ చిత్రం Symphony in White No.2 అన్న చిత్రం ప్రపంచపు గొప్ప చిత్రాలలో మొదట వరసలో వుంచ దగ్గ చిత్రంగా భావించబడింది.

ఈ చిత్రంతో అతను అనంతమైన ఖ్యాతిని సాధించాడు. అలానే విమర్శలను కూడా ఎదుర్కొన్నాడు. అసలు రంగులకు, సంగీతానికి సంబంధం ఏమిటి? అన్న ప్రశ్నతో చిత్రానికి పెట్టిన పేరుపై రగడ మొదలైంది. ''సంగీత మంటే కావ్యాత్మకమైన గానమే కానవసరం లేదు, కను విందుచేసే రంగుల విలాసం కూడా సంగీతమే'' అని సమాధాన మిచ్చాడు. ఈ చిత్రంలో తెల్లని మేనిఛాయతో, తెల్లని గౌను ధరించి, తెల్లటి విసన కర్రను చేత బట్టుకొని తెల్లని గోడబల్ల (hearth) పై చేయివేసిన సుందరి, ఆమె చేతిని అనుకుంటూ ఒక తెల్లని పింగాణీ పాత్ర ఇవన్నీ ఎలాంటి వారి నయినా దృష్టి మరల్పనివ్వదు. చిత్రమంతా ఒక ప్రశాంతమైన ఉద్వేగంతో నిండివుంటుంది. ఈ చిత్రంలో నవనవోన్మేషమైన జో సౌందర్యం ఆవిష్కరించబడింది (2వ అట్టపై చిత్రం). ఈ చిత్రాన్ని చూసిన ఎందరో, ఈ చిత్రంతో బాటుగా ఈ చిత్రంలోని జోనా పై కూడా ప్రేమలో పడ్డారు. అలాంటి వారిలో విషలర్ గురుతుల్యుడైన కోర్బెట్ (కోర్బెట్ వేసిన స్వలింగ సంపర్కులు అన్న చిత్రానికి 'జో' మోడల్‌గా చేసి ఒక ఉద్వేగ పూరితమైన భంగిమలో ఫోజులిచ్చింది - ఇదంతా కొంత కాలం

తరువాత జరిగింది) తో పాటు ప్రఖ్యాత కవి అయిన స్విన్ బర్న్‌లు కూడా వున్నారు. స్విన్ బర్న్ ఈ చిత్రాన్ని చూసి మోహావేశంతో Before the mirror (అద్దంముందు) అన్న పద్యాన్ని చెప్పాడు. దాని పాఠాంశం:

**Before The Mirror**

Come snow, come wind or thunder,
High up in air,
I watch my face, and wonder
At my bright hair,
Nought else exalts and grieves
The rose at heart, that heaves
With love of her own leaves
and lips that pair.

She knows not love that kissed her
She knows not where.
Art thou, the ghost my sister,
White sister there,
Am I the ghost who knows?
My hand a fallen rose,
Lies snow-white on white snow,
and takes no care.

**అద్దంముందు**

ఆగమించు హిమతుషారమా, ఆగమించు తటిత్తో,
అనిలమో ఏదో ఒకటి
ఎంతో ఎత్తున గాలిలో, నా ముఖం చూసుకొన్నాను,
నా కాంతివంతమైన కేశాలకు విస్మితుడనయ్యాను
జతకట్టే అధరాల కంటె, స్వీయ పత్రాల ప్రేమతో
గుండెను తాకే గులాబీ కంటె
ఏదీ మోదమూ కాదు, ఖేదమూ కాదు.
ఆమెకు తెలియదు ఆమెను ముద్దెట్టుకొన్న ప్రేమ ఏదో
ఎక్కడ ముద్దెట్టుకొన్నదీ ఆమెకు ఎరుక లేదు.
ఎవరు నీవు? ప్రేతమైన సోదరివేనా
నా శ్వేత సహోదరి అక్కడ
నేనే ప్రేతాన్నేమో ఎవరికెరుక?
హిమధవళం మీద ధవళహిమంలా
నా చేయి ఒకరాలిన గులాబీ
అదేమీ పట్టించుకోదు.

స్విన్‌బర్న్ స్వహస్తాలతో వ్రాయబడ్డ ఈ గీతం చాలా కాలం ఈ చిత్రంతో బాటే ప్రదర్శిత మయింది.

తెలుపు వర్ణంతో ఒక్కోసారి నీలం, ఒకోసారి పసుపు వర్ణాలు ఛాయా మాత్రంగా కలసి వుంటాయి. మనందరం తెలుపు రంగు ఎలా ఉన్నా దానిని తెలుపు అనే అంటాము. కానీ నిత్యం మంచు కొండల మధ్య జీవించే ఎస్కిమోలు తెలుపు వర్ణంలో 17 ఛాయా భేదాలు చూసిన వెంటనే గ్రహించగలుగుతారు. వాటిని వేర్వేరు పేర్లతో పిలుస్తారు. విషలర్ తన చిత్రాలలో ఎనిమిది రకాల తెలుపు ఛాయ భేదాలను ఉపయోగించాడని శాస్త్రవేత్తలు గుర్తించారు. ఈ చిత్రాన్ని ప్రస్తుతం ఇంగ్లండ్‌లోని టేట్ (Tate) గ్యాలరీలో చూడవచ్చు. 7 సంవత్సరాల కాలం అతనితో జీవితాన్ని పంచుకొన్న 'జో' ఒకనాడు అతనిని విడచి వెళ్ళింది. దీనికి ఇదమిద్దమైన కారణం తెలియదు.

'జో' నిష్క్రమణ అనంతరం విషలర్ పూర్తిగా మతి పోగొట్టుకున్నాడు. అసహనం, చికాకుతో, కోపం హద్దులు మీరింది. తెలుపు రంగు నేపథ్యంతో చిత్రాలు వేయటం జోతో బాటుగానే తెరమరుగయ్యాయి. 1871వ సంవత్సరంలో అనారోగ్యంతో అలమటిస్తూ, జీవన సంధ్యకు చేరుకున్న తన తల్లి చిత్రాన్ని 'అమ్మ' అన్న పేరుతో గీశాడు. ఈ చిత్రంలో ఒక పక్కగా నిరాశక్తతో కూర్చున్న తల్లి యొక్క పార్శ్వపు (Profile) భాగాన్ని చిత్రించాడు. అతి తక్కువ రంగులతో వేసిన ఈ చిత్రంలో కనబడని బాధ తొంగి చూస్తుంది. విషలర్ అన్ని చిత్రాలలో వలే ఇందులో కూడ మూడవ అయితనం (3rd Dimension) తక్కువగా ఉండి జపనీయుల రేఖా విలాస ప్రాభవం ఎక్కువగా కనిపిస్తుంది. అతని కీర్తి కిరీటంలో ఇది ఒక కలికితురాయిగా మిగిలిపోయింది. ఈ చిత్రం నేపథ్యంతో ఒక హాలీవుడ్ చిత్రం కూడా నిర్మించబడింది. 1891వ సంవత్సరంలో ఫ్రెంచి ప్రభుత్వం లవ్రే మ్యూజియం

కోసం అమ్మ చిత్రాన్ని కొనుగోలు చేసి ప్రదర్శనలో ఉంచింది. విశ్వ భాషలలో 'అమ్మ'ను మించిన పదం లేదు అన్న మాటను అక్షర సత్యం చేస్తుంది ఈ చిత్రం (3వ అట్టపై చిత్రం).

ఇక పూర్తి విషాదంలో కూరుకుపోయిన విషలర్ ఈసారి తెలుపును వదలి నలుపు రంగులో తన ప్రావీణ్యాన్ని చూపించదలిచాడు. నలుపు రంగు ఛాయ భేదాలతో ఎన్నో చిత్రాలు గీసి వాటికి కూడా సంగీత పరమైన నిశీద సంగీతం (Noctunes) 1, 2, 3 ఇలా పేర్లు పెట్టుకుంటూ వెళ్ళాడు. అయితే ఇవేమి చూపరులను ఆకర్షించలేకపోయాయి. ఎక్కువ భాగం అమ్ముడు కాలేదు. దీనికి తోడు ఆనాటి ప్రఖ్యాత కళా విమర్శకుడైన రస్కిన్ ఈ చిత్రాల పరంపరను పరమ చెత్తగా విమర్శించాడు. విమర్శను సహించలేని విషలర్ రస్కిన్‌పై పరువు నష్టం దావా వేసి చిట్టచివరకు నెగ్గాడు. అయితే న్యాయస్థానం రస్కిన్‌కు కేవలం ఒక ఫార్తింగ్ (పెన్నీలో నాల్గవ వంతు) పెనాల్టీ విధించింది. విషలర్ నైతిక విజయంసాధించినా కోర్టు ఖర్చులపై విపరీతంగా ఖర్చుపెట్టి ఆర్థికంగా దివాళా తీశాడు.

ఇంతలో ఇంగ్లండ్‌లో నివసిస్తున్న ప్రముఖ ఓడల వ్యాపారయిన ఫ్రెడరిక్ లేలాండ్ విషలర్ చిత్రాలపై విపరీతమైన మక్కువ చూపేవాడు. లివర్ పద్దనున్న తన ఇంటిని అలంకరించవలసిన బాధ్యత విషలర్‌కు అప్పజెప్పి దేశాటనకు వెళ్ళాడు. దొరికిన అవకాశాన్ని సద్వినియోగ పరచుకొనే ఉద్దేశంతో విషలర్ మొత్తం ఇంటిని నీలం, బంగారు రంగుల కలయికగల నెమిలి చిత్రాలతో నింపి తన స్నేహితులను, కొందరు పత్రికేయులనూ పిలిచి తన కౌశాల్యాన్ని చూపించాడు. ఇంతలో దేశానికి తిరిగి వచ్చిన ఫ్రెడరిక్ తన ఇంటిని ఒక ప్రదర్శన శాలగా మార్చిన విషలర్ పై చిందులు తొక్కాడు. ముందు మాట్లాడుకున్నట్లుగా 2000 గిన్నెలు బదులు 1000 గిన్నెలు మాత్రమే అతనికి చెల్లించబడ్డాయి. రాబోయే డబ్బును ఆశించి అవసరానికి మించి డబ్బు ఖర్చుపెట్టే అలవాటుగల విషలర్ దీనితో పూర్తిగా కృంగి ఇంగ్లండ్‌లో ముఖం చెల్లక వెనిస్ నగరానికి చేరుకున్నాడు. 1880లో తిరిగి ఇంగ్లండ్ చేరి ఈ సారి ప్రముఖుల చిత్రాలను వేసి పోగొట్టుకున్న పేరును, డబ్బును తిరిగి సంపాదించాడు. ఈసారి అతని అభిమానులలో ఆస్కార్ వైల్డ్ కొత్తగా చేరాడు. ప్రిన్స్ ఆఫ్ వేల్స్ అతని చిత్ర ప్రదర్శనలకు తప్పని సరిగా హాజరయ్యేవాడు. 1888వ సంవత్సరంలో బీట్రెక్స్ గాడ్విన్ అనే ఆమె ప్రేమలో పడి వివాహం చేసుకున్నాడు. వైవాహిక జీవితం ఆనందంగా గడచిపోతుంది. పెండ్లి తరవాత అతనిలో మానసికమైన మార్పు ఏర్పడింది. మనిషినెమ్మదైనాడు. థామస్ కార్లైల్ చిత్రం అతని పురాత ప్రాభవాన్ని తిరిగి తీసుకొనివచ్చింది. ప్రపంచ వ్యాప్తంగా కొనుగోలు దారులు అతని చిత్రాలకై ఎగబడ్డారు. భార్య బీట్రెక్స్‌ను తీసుకొని పారిస్ నగరం చేరుకున్నాడు. బీట్రెక్స్ అనారోగ్యానికి గురైంది. చివరకు 1896వ సంవత్సరంలో కేన్సర్ వ్యాధితో ఆమె మరణించింది. 1903వ సంవత్సంరలో దీర్ఘకాలిక అనారోగ్యంతో బాధపడి విషలర్ మరణించాడు. అతని అంతిమ యాత్రలో ఒకనాటి అతని ప్రియురాలు, జో హాజరవటం ఒక విశేషం.

విషలర్ వ్యక్తిగా డంబాచారం గలవాడు. వేషభాషలు తీవ్రమైనవి. మాటకరకు దీనికి భిన్నంగా లావణ్యంతో, చక్కటి వర్ణ సముదాయంతో శోభిల్లుతూ ఉంటాయి అతని చిత్రాలు. వ్యక్తిగా అతను ఒక అలజడి జీవితాన్ని సాగించాడు. చిత్రాలు మాత్రం ప్రశాంతంగా ఉంటాయి. ఒక వ్యక్తి యొక్క కళారూపాన్ని బట్టి ఆ వ్యక్తిని అంచనా వేయవచ్చు అన్న సూత్రం అతనికి వర్తించదు. ఏది ఏమైన శ్వేత వర్ణపు ఛాయా భేదాలతో వేసే చిత్రాలు అత్యంత మనోహరంగా ఉంటాయని నిరూపించాడు విషలర్. అతని తరవాత స్సార్జంట్, మోనట్ డేగాస్ మున్నగువారు తెలుపు రంగు పై స్ఫూర్తిని పొందడానికి విషలర్ చిత్రాలు ప్రేరకాలుగా నిలిచాయి.

# మార్క్విజ్ డి శేడ్ - శేడిజం

- బి.వి. రామిరెడ్డి

డొనేషియన్ అల్ఫొన్సె మార్క్విజ్ డి శేడ్ పారిస్‌లో 1740లో జన్మించాడు. తల్లి కోన్డే పాలేస్‌లో చెలికత్తెగా ఉండేది. ఆమె బాలుడైన రాజకుమారుడికి ఆడుకునే సహచరుడిగా శేడ్‌ని ఏర్పాటుచేసింది. శేడ్ రాజకుమారుణ్ణి హేళన చేయడంవల్ల అతణ్ణి మేనమామ అబ్బే డి శేడ్ దగ్గరికి పంపించేశారు. అతని మేనమామ వక్రశృంగార జీవిగా పెద్ద పేరుగలవాడు.

శేడ్ పారిస్‌లోని లైసీ లూయీ లెగ్రాండ్ జెసూట్ స్కూల్లో ప్రాథమిక విద్యాభ్యాసం చేశాడు. అక్కడే అతడు క్లాసిక్స్ చదివాడు. జెసూట్ విద్యా విధానంలో కొత్త పద్ధతుల్ని ప్రవేశపెట్టేవారు. అప్పుడప్పుడు ప్రయోగాత్మక నాటకాలు ప్రదర్శింపజేశావారు. ఆ రకంగా శేడ్‌కి జీవితకాలం నాటకాలంటే విపరీతాభిమానం వుండేది. జెసూట్ విద్యాలయాల్లో చిన్న తప్పులకి కూడ కఠిన శిక్షలుండేవి. శేడ్ జీవితంలోను, భావాత్మక రచనల్లోను విపరీతమైన వక్ర శృంగారాభిమాని అయ్యాడు.

పధ్నాలుగు సంవత్సరాల వయసులో శేడ్ రాజుగారి లైట్ హార్స్ రెజిమెంటుకు చెందిన అశ్విక మిలటరీ శిక్షణా స్కూలులో చేరాడు. త్వరలోనే సెకెండ్ లెఫ్టినెంట్ అయ్యాడు. 1756-63 సంవత్సరాల మధ్య నెదర్లాండ్స్‌లో జరిగిన ఏడేళ్ళ యుద్ధంలో పాల్గొన్నాడు. 17 సంవత్సరాల కాలం సైన్యంలో పనిచేసి అశ్విక దళాధిపతి అయ్యాడు. 1764లో తండ్రి స్థానంలో నాలుగు మండలాలకి లెఫ్టినెంట్ జనరల్ అయ్యాడు.

ఇరవయ్యేళ్ళ వయసులోనే వ్యభిచారంలో మునిగి తేలి అప్పులపాలయ్యాడు. తల్లి దండ్రులిద్దరి వేపు నించీ ఆభిజాత్యం, హోదా, సంపద లభించడంతో ప్రకృతి, అదృష్టం అతని మీద విపరీత ప్రభావాలు చూపాయి. తండ్రి కామ్టె డి శేడ్ తనపుత్రుడు చెడిపోతున్నాడని గ్రహించి 1763లో రెనీ పెలాజి డిమోంట్రియుల్‌తో వివాహం జరిపించాడు. రెనీ తండ్రి టాక్సేషన్ కోర్టుకి అధ్యక్షుడు. లారెని వివాహం చేసుకోవాలనుకుని చివరికి రెనీని వివాహమాడాడు. రెనీ అతణ్ణి ఎన్నో కష్టాల్లో ఆదుకుంది. వివాహం అయిన అయిదు నెలల తరువాత జోన్ టెస్టార్డ్ అనే యువతి శేడ్ తనతో వక్రశృంగార కలాపం నడిపినట్లు పోలీసులకు తెలియజేసింది. మత గుర్తుల్ని శృంగార కలాపాల్లో హీనపరిచేవాడు. దాంతో జైలు పాలయ్యాడు. అత్తగారు మేడం డి మాంట్రియుల్ టెస్టార్డ్‌కి డబ్బిచ్చి ఆ గొడవను సర్దుమణిగే ఏర్పాటు చేసింది. పారిస్ నేరాల స్క్వాడ్‌కి ఇన్‌ఛార్జ్‌గా వున్న ఇన్‌స్పెక్టర్ మరాయిస్ అతణ్ణి కనిపెట్టి చూస్తుండేవాడు. ఇతడే శేడ్ వక్రశృంగార కార్యకలాపాలను గురించి రాజుకు రిపోర్టు చేశాడు.

ఆ రోజుల్లో అందరు యువకుల్లాగే శేడ్ నాటకశాలల దగ్గర తిరుగాడుతుండేవాడు. బ్యూవొయిసిన్ అనే నటితో లాకాస్ట్ వెళ్ళి, ఆమెను భార్యగా పరిచయం చేసుకున్నాడు. ఆ విధంగా తన అత్తగారితో విరోధం తెచ్చుకున్నాడు.

1768లో ఈస్టర్ ఆదివారం రోజున 36 ఏళ్ళ వయసున్న రోజ్‌కెల్లర్ అనే విధవరాలిని పారిస్ చివరనున్న ఒక యింటికి తీసుకెళ్ళి, మరో యిద్దరు వేశ్యలతో కలిసి, ఆమెను శారీరకంగా బాధించి, గాయాలను నయం చేశాడు. ఆమె తప్పించుకుని, ఆడవాళ్ళతో తన బాధాకర అనుభవాలను చెప్పి వారి సాయంతో పోలీసులకు రిపోర్టు చేసింది. అతని అత్తగారు ఆమెకు డబ్బిచ్చి నోరుమూయించింది.

---

బి.వి. రామిరెడ్డి, సిద్ధార్థ ఆర్ట్స్ & సైన్స్ కళాశాలలో ఆంగ్లోపన్యాసకులుగా పనిచేస్తున్నారు, విజయవాడ.

అయినా అతని మీద ప్రజలకు అసహ్యం ఏర్పడింది. అతని కేసు లాటోర్నెలోని ఉన్నత నేర న్యాయ స్థానానికి వెళ్ళింది. అక్కడ అతనికి జరిమానా విధించి వొదిలేశారు. రాజు అతణ్ణి లాకాస్టేలోనే వుండవలసిందని ఆజ్ఞాపించాడు. అక్కడే శీతాకాలంలో చాటూ థియేటరులో తాను రచించిన హాస్యనాటకాన్ని ప్రదర్శింప జేశాడు.

మోర్సెయిల్‌లో నలుగురు యువతులతో శృంగార కలాపంలో పాల్గొన్నాడు. వాళ్ళకు అనీసీడ్ మిఠాయిలు ఇచ్చి తినిపించాడు. అవి యిద్దరు యువతుల అనారోగ్యానికి కారణమయ్యాయి. అతడు విషప్రయోగం చేశాడని అభియోగం మోపబడింది. ఈకేసు మార్సెయిల్స్‌లోని సెనెశ్చాల్‌కోర్టుకు వెళ్ళింది. శేడ్‌ని అరెస్టుచేయమని వారెంటు జారీ చేయబడింది. డిలాన్సెతో కలిసి ఇటలీకి పారిపోయాడు. మార్సెయిల్స్ కోర్టు శిరచ్ఛేదన శిక్ష విధించింది. వారి శరీరాలను కాల్చి, బూడిదను వెదజల్లాలని ఆదేశించింది. ఆ శిక్షను శేడ్ హేళన చేశాడు.

శేడ్ తన భార్య సోదరితో లేచిపోయాడు. అత్తగారీ విషయాన్ని భరించలేక పోయింది. ఫలితంగా శేడ్ మళ్ళీ అరెస్టు చేయబడ్డాడు. ఈసారి మియోలాన్స్‌లో జైలు చేయబడ్డాడు. అతని భార్య రెనీ మగవేషంలో అక్కడికి వెళ్ళి అతణ్ణి విడిపించాలని చూసింది. పోలీసుల్ని తప్పించుకుని లాకాస్ట్ చాటీలో దాక్కున్నాడు. 1774 వరకూ, భార్య రెనీ అతణ్ణి రక్షించేందుకు ప్రయత్నిస్తూ అతనికి అండగావుంది. పారిస్‌కి తిరిగివొచ్చి మళ్ళీ అయిదుగురు యువతులతో అక్రమ శృంగారంలో పాల్గొన్నాడు. వారి తల్లి దండ్రులు అతడి మీద కేసు పెట్టే ప్రయత్నం చేశారు. రెనీ తల్లి సహాయంతో ఆగొడవను మాఫీ చేసే ప్రయత్నం చేసింది.

శేడ్ ఇటలీలలో విస్తృతంగా పర్యటించేందుకు బయలుదేరాడు. తన పర్యటనా విశేషాలను 'వాయేజ్ డి ఇటలీ'గా రికార్డు చేశాడు. ఈ అనుభవాలే అతని ప్రసిద్ధనవల 'జూలియెట్' లో వర్ణింపబడ్డాయి. 1776లో శేడ్ లాకాస్టేలో వున్నప్పుడు 'జస్టిన్' అనేనేత వృత్తికారుడు కుమార్తెను పనికి కుదుర్చుకున్నాడు. ఆమెతో బాటు మరో నలుగురు యువతుల్ని కూడా తీసుకున్నాడు. మరుసటి రోజు వారు పోతూ జస్టిన్ తండ్రితో శేడ్ డబ్బిచ్చి, తమతోను అతనికుమార్తెతోను అక్రమ శృంగారానికి ప్రయత్నించాడని చెప్పారు. అతడు పిస్టల్‌తో ఆయింటి మీద దాడి చేశాడు. ఆ అమ్మాయి పేరుతోనే శేడ్ 'జస్టిన్' నవల వ్రాశాడు.

శేడ్ రెనీని, తనని బ్రతిమాలుకున్న జస్టిన్‌ని తీసుకుని పారిస్‌కు వెళ్ళాడు. పారిస్‌లో ఇన్‌స్పెక్టర్ మరాయిస్ అతణ్ణి అరెస్టు చేసి విన్సెస్ కోటకు తీసుకువచ్చాడు. 1778లో ఎయిక్స్ కోర్టు అతని మీద 1772వ సంవత్సరపు కేసుతో కలిపి, కొత్త అభియోగాలతో కేసుపెట్టింది. శేడ్ మరాయిస్ కస్టడీ నుండి తప్పించుకుని మళ్ళీ లాకాస్టెకి పారిపోయాడు. 1778 ఆగస్టులో మరాయిస్ అతణ్ణి మళ్ళీ అరెస్టు చేశాడు. పదేళ్ళ జైలు శిక్షపడింది.

శేడ్‌ని వక్రశృంగార జీవిగా అందరూ పేర్కొంటారు కాని ''ప్రతి ఆరోగ్యవంతుడూ శృంగారంలో సంతృప్తిని పొందేందుకు ఎంతో కొంత 'అతి' ని ఆశ్రయిస్తాడు. దాన్ని వక్రశృంగారం అనొచ్చు.'' అని ఫ్రాయిడ్ అంటాడు. శేడ్‌ది వక్రశృంగారం అయితే మరి, శృంగార సంతృప్తికోసం నేటిమన పట్టణాల్లోని టెలిఫోన్ బూత్‌లలో ప్రకటింపబడే 'హమ్ అండ్ బాండ్' ప్రకటనల మాటేమిటి?

శేడ్‌కి గుద శృంగారం అంటే విపరీతాభిమానం. అదే అతని రచనల్లోను ఎక్కువగా కనుపిస్తుంది. దానికి సంబంధించిన కాప్రోఫగీ, అంటే శారీరక వాసనలు, మలాన్ని నాకడమూ, తినడములాంటివి వక్రతలనడానికి వీల్లేదని ఫ్రాయిడ్ అన్నాడు. సిగ్గును, అసహ్యతను అధిగమించడానికీ, గొప్ప సంతృప్తిని పొందడానికీ, శృంగారంలో అలాంటివి సహజమేనని ఫ్రాయిడ్ పేర్కొన్నాడు.

జైలులో శేడ్ 6వ నంబరు గదిలో వుండేవాడు. అతడు పెద్ద ఖైదీగా గుర్తింప బడ్డాడు. అతణ్ణి అందరూ మిస్టర్ నం. 6గా చెప్పుకునేవారు. భార్య రెనీ జైల్లో అతని సౌకర్యాల కోసం, మంచి భోజనం ఏర్పాటు కోసం ఎంతో ఖర్చు పెట్టింది. జైలు లోపల వ్యాయామం చేసే అవకాశం యిచ్చేవారు కాదు. దాంతో బాగాలావయ్యాడు. తన శక్తినంతటినీ రచన వేపు మళ్ళించాడు. మంచి లైబ్రరీని ఏర్పాటు చేసుకుని ఆనాటి శాస్త్రీయమైన ఆలోచనల్ని చదివి ఆకళింపు చేసుకున్నాడు. వోల్టేర్, రూసోలను చదివాడు. సమగ్రమైన మానవ స్వభావాన్ని సమాజం ఎలా చెడగొడుతుందో వారి రచనల ద్వారా తెలుసుకున్నాడు. వారి మత వ్యతిరేక భావాలు శేడ్‌ని బాగా ఆకట్టుకున్నాయి. ''మానవులు సహజంగా మంచి వాళ్ళుగానే వుంటారు, కాని సంఘం వారి అమాయకతను వక్రీకరిస్తుంది'' - అనే డిడెరాట్, రూసోలభావన అతనికి నచ్చలేదు. లామెట్రి ''మనిషి జంతుప్రపంచానికి చెందిన వాడనీ, అతనికి ఆత్మవుంటుందనీ, అది శరీరంతో అంతమౌతుందనీ, మానవజీవిత ప్రయత్నమంతా సౌఖ్యాన్వేషణే'' అనీ అన్నాడు.

శేడ్‌కి ఆంత్రోపాలజీ (మానవశాస్త్రం) అంటే కూడా ఇష్టమే. ''దివాయేజేస్ ఆఫ్ జేమ్స్‌కుక్'' ని చదివాడు. పుస్తక పఠనం వల్ల శేడ్ బుర్ర చెడిపోతోందనీ, గందరగోళమైన భయంకర విషయాలు వ్రాసేందుకు అతని పుస్తక పఠనం ప్రేరేపిస్తున్నదనే మిషతో అతడి పుస్తక పఠనాన్ని నిషేధించారు. సంఘ వ్యతిరేకమైన రచనలు చేయడానికి ఈనిషేధం శేడ్‌ని ప్రేరేపించింది. అతణ్ణి రూసో 'కన్ఫెషన్స్' ని చదువ నీయలేదు. అందులో అతని శృంగార వక్రతలతో సహా అతని స్వాభావికసత్యాలన్నీ వ్రాయబడ్డాయి. ''నువ్వేది వ్రాసినా సీరియస్‌గా వ్రాయి. బ్రతుకు తెరువుకోసం వ్రాయకు. నీలోని బలహీనతల్ని నీరచనల్లోకి చొప్పిస్తావు, అదొక తపన'' అని రూసో అన్నాడు.

★ ★ ★ ★ ★

1782లో శేడ్ ''డైలాగ్ బిట్వీన్ ఎప్రీస్ట్ అండ్ ఎడైయింగ్ మాన్'' వ్రాశాడు. ఇందులో చనిపోతున్నమనిషి ద్వారా శేడ్ ప్రీస్ట్‌ని అడిగించిన ప్రశ్నలు సమాధానాలకు అందనివి. మనకు తెలియని, అర్థంకాని వాటిని మనం నమ్మలేం. ప్రకృతికి తన కార్యాలను విశదీకరించేందుకు తనకంటె ఉన్నతమైన శక్తి అనవసరం. ప్రకృతి తన అవసరం కోసం మనిషిని సృజించుకుంది. అద్భుతాలన్నీ ట్రిక్కులే. అద్భుతాల్లోని సత్యానికి అర్థం లేదు. అద్భుతాలు ప్రకృతి సూత్రాలకు విరుద్ధాలు. ప్రకృతి ఆధిపత్యం ఎక్కడ అంతమౌతుందో, ప్రకృతి సూత్రాలు ఎక్కడ తెగిపోతాయో చెప్పగలిగిన వారెవరు? ప్రపంచంలో ఎన్నో మానవ సమాజాలున్నాయి. అన్ని మానవ సమాజాలకు అంతమంది దేవుళ్ళున్నారు. ప్రవక్తలంతా ఒకేతరహా. మనిషికి వ్యతిరేకంగా మనిషిని ఉసిగొల్పడమే మతాల పని. ఈమత ఘర్షణల వల్ల ప్రపంచంలోని అన్ని యుద్ధాల్లోనూ చచ్చిపోయిన మనుషులకన్న, అన్ని భయంకర రోగాల వల్లా చచ్చిపోయిన మనుషుల కన్న - ఎక్కువ మంది చనిపోయారు.

'మానవుడిలో సహజంగానే ప్రాకృతికమైన శృంగార లక్షణాలు నిక్షేపింపబడి వున్నాయి. అవి సహజమైనవి. వాటిని తిట్టుకోవడం, అణుచుకోవడం అర్థ రహితం' - అనేది శేడ్ అభిప్రాయం. ఈ విషయంలో శేడ్ అభిప్రాయాలు 3వ శతాబ్దపు పర్షియన్ ప్రవక్త 'మని' అభిప్రాయాలకు దగ్గరగా వుంటాయి. ప్రకృతిలో మంచికీ చెడుకూ, దేవుడికీ సైతానుకీ సమానమైన గౌరవం ఇవ్వాలనేది అతని అభిప్రాయం. హిందూ మతం కాళికా దేవిని పూజిస్తుంది. ఆమె ప్రపంచపు నాశన శక్తికి ప్రతీక. ఆమె భక్తులైన థగ్గులు ఆమెకు నరబలులిచ్చేవారు. హత్య శేడ్ కున్న అబ్సెషన్లలో ఒకటి. ప్రకృతికి అవసరమైన, లేదా అనవసరమైన మంచిగాని, చెడుగాని లేవు. ఈ రెంటి మధ్య ప్రకృతి ఖచ్చితమైన సమతౌల్యాన్ని పాటిస్తుంది. అందుచేత వాటిని పెంచడానికీ తగ్గించడానికీ మనం అశక్తులం. మానవుడు ప్రాకృతికమైన ఈ రెంటికీ మధ్య ఊగే పెండ్యులం లాంటివాడు. శేడ్ పదేపదే తన రచనల్లో ఈ వాదనను వినిపిస్తాడు. ప్రకృతి సృజిస్తుంది. నాశనం చేస్తుంది. చావు తరవాత ఏమీ మిగలదు. మృత్యువు భయంకరమైనది కాదు, అదొక ఓదార్పు. మృత్యువు తరవాత శిక్షలూ లేవు, బహుమతులూ లేవు, చివరలో చనిపోయే మనిషి ప్రీస్టుతో చనిపోయేముందు, ఆఖరుసారిగా అయిదుగురు అందమైన యువతులతో ఆనందాన్ని పంచుకోవాలి అంటాడు. దాంతో ప్రకృతిలో చెడిపోవడం అంటే ఏమిటో సమాధానం చెప్పలేక అతడూ చనిపోయే మనిషితో పాటు ఆనందాన్ని పంచుకోవడానికి సిద్ధపడతాడు.

అది చాలా ప్రమాదకరమైన రచనకావడం మూలాన శేడ్ ఆరచన తాను చేయలేదని చెప్పుకున్నాడు. కానీ, రెనీకి వ్రాసిన ఉత్తరంలో తన నమ్మకాలు స్థిరమైనవని చెప్పాడు. ''నా ఆలోచనలు నావి. అవి నా జీవితం నించి ఉద్భవించినవి. వాటిని నేను మార్చుకోలేను. అవే నా జీవితానికి ఓదార్పు. అవి జైలులో నా బాధల్ని మరిపింప జేశాయి. అవి నా ప్రాపంచిక సౌఖ్యాలకు సంబంధించినవి. అవి నా జీవితం నించి విడదీయరానివి. నా దురదృష్టాలు నా ఆలోచనలవల్ల వచ్చినవి కావు; ఇతరుల ఆలోచనా ధోరణి వల్ల వచ్చినవి'' అన్నాడు.

★ ★ ★ ★ ★

ఈ రచనకు ముందు శేడ్ జైలులో దాదాపు పదిహేడు నాటకాలు వ్రాశాడు. ''ది టు ట్విన్స్ (లేక) ది డిఫికల్ట్ ఛాయిస్'', ''ది మిస్ యాంత్రోప్ త్రూ లౌ'', ''జీన్ ఐ ఆన్నే (లేక) ది సీజ్ ఆఫ్ బ్ర్యూవెస్'' వాటిలో కొన్ని. వీటిలోని సంభాషణలు అంత పదునైనవి కావు.

★ ★ ★ ★ ★

నవలా రచయితగా శేడ్ ప్రసిద్ధుడు. 'నవలంటే మనుషులు తమ జీవితాల్లో అనుభవించిన అసామాన్యమైన సాహసాల ఊహాత్మక రచన' అని శేడ్ అభిప్రాయాం. అతడు ఆంగ్ల నవలల్ని బాగా చదివాడు. హెన్రీఫీల్డింగ్ వ్రాసిన ''ది హిస్టరీ ఆఫ్ టామ్ జోన్స్'', శామ్యూల్ రిచర్డ్సన్ వ్రాసిన 'క్లారిస్సా' లేక 'ది హిస్టరీ ఆఫ్ ఎ యంగ్ లేడీ' అతనికి బాగానచ్చిన నవలలు.

శేడ్ నవలా రచన ప్రారంభించడానికి ముందే జాన్ క్లెలాండ్ వ్రాసిన శృంగార ప్రేరక నవల 'ఫానీ హిల్' చదివాడు. వోల్టేర్ రచించిన కేన్ డైడ్, జాడిగ్; పియర్ కొడెర్లోస్ డి లాక్లాస్ వ్రాసిన 'లేస్ లైజెన్స్ డెంజరసెస్' అనే స్వేచ్ఛా శృంగార నవలల్ని చదివాడు. శేడ్ నవలలు ప్రధానంగా కోరికలకు సంబంధించినవి. ''ప్రకృతి నీతి వాదుల వివరణలకు లొంగదు. అది అనంతంగా వారికి అర్థంకాకుండా

పోతుంటుంది'' అంటాడు శేడ్. అగ్ని పర్వతాలంటే శేడ్‌కి చాలా యిష్టం. శేడ్ ప్రకృతిని అగ్ని పర్వతంతో పోలుస్తాడు. ప్రకృతిహృదయం నిరంతరంగా రగులుతూ మనిషికి అవసరమైన వజ్రాలనిస్తుంది, లేదా మనిషిని నశింపజేసే పిడుగుల్నిస్తుంది. 1784లో శేడ్‌ని విన్సెనించి పారిస్ బాస్టిల్ జైలుకు మార్చారు. రాజు క్రూరత్వానికి అసహ్యమైన ప్రతీక-ఈ జైలు. ఇందులో ఉన్నత వర్గానికి చెందిన వారినే వుంచేవారు. భార్య రెనీకి వ్రాసిన ఉత్తరంలో అక్కడి పరిస్థితులు పరమ దారుణంగా వున్నాయని శేడ్ పేర్కొన్నాడు. భార్య సహాయంతో ఆరువందల పుస్తకాలతో తన లైబ్రరీని ఏర్పాటు చేసుకున్నాడు. అక్కడున్న అయిదు సంవత్సరాల కాలంలో శేడ్ వేగంగా రచనా వ్యాసంగాన్ని కొనసాగించాడు. 1788లో తన రచనల పట్టికను తయారు చేశాడు. అందులో జైలు వాళ్ళ కంటబడకుండా దాచుకున్నవిగాక 15 వాల్యూములు వ్రాశాడు. అతడు దాచిపెట్టిన వాటిలో '120 డేస్ ఆఫ్ సోడం' అనే రచన ముఖ్యమైనది. అది అనితరమైన భావాత్మక రచన అని శేడ్ పేర్కొన్నాడు. దాన్ని ఎప్పుడో అప్పుడు జైలు ఆఫీసర్లు కనుగొంటారని తెలిసి, దాని ఫెయిర్ కాపీని మందమైన 10-12 సెం. మీ కాగితపు ముక్కల మీద వ్రాసి, వాటిని ఒకదానితో ఒకటి అంటించి, 12 మీ॥ పొడవుగల ఆకాగితాన్ని రోల్‌గా చుట్టాడు. ఆ రచనను పూర్తి చేయడానికి శేడ్‌కు 37 రోజులు పట్టింది. ఇది టాయిలెట్ పేపరు మీద వ్రాయబడిన మొట్టమొదటి నవల.

1789లో ఫ్రెంచి విప్లవం వీధుల్లో కొచ్చింది. శేడ్ ఒక డ్రైన్‌జి గొట్టాన్ని మెగాఫోన్‌గా చేసి దాని సాయంతో బయటి వీధిలోని విప్లవ వాదులకు వినిపించేట్టుగా, జైలులోని తమను చంపేందుకు ప్రయత్నిస్తున్నారని కేకలు వేశాడు. అర్ధరాత్రి శేడ్‌ని పిస్టలుతో బెదిరిస్తూ, చారెన్‌టన్ పిచ్చాసుపత్రికి తీసుకు పోయారు. అతనితో బాటు అతని పుస్తకాలను గాని, వ్రాత ప్రతులను గాని తీసుకు వెళ్ళనీయ లేదు.

1789 జులై14న జనసమూహం బాస్టిల్ జైలును చుట్టుముట్టి, కమాడెంట్‌ని చంపి శేడ్ వస్తువుల్ని దోచుకున్నారు. ఆ వస్తువుల్ని అక్కడి నుండి తొలగించడంలో రెనీ ఆలస్యం చేసింది. ఈవార్తను విని తన '120 డేస్ ఆఫ్ సోడం' నాశనం చేయబడి వుంటుందని రక్తా శ్రువులు కార్చాడు. కాని ఆ పేపర్ రోల్ ఎవరికంటా పడక ఆ జైలు గదిలోనే వుండిపోయింది. 1904లో బెర్లిన్‌కు చెందిన ఇవాన్ బ్లాక్ 'యునీ డురెన్' అనే మారుపేరుతో దానిని ప్రచురించాడు. ఈ పుస్తకం శేడ్ జీవించిన కాలంలోనే ఇంగ్లండ్, ఫ్రాన్స్, జర్మనీలలో సంచలనం సృష్టించింది. ఈ రచన తరవాతి కాలంలో 'ఫ్రాంకిన్ స్టైయిన్' (1818), 'డ్రాక్యులా' (1897), అమెరికన్ రచయిత ఎడ్గార్ ఆలన్ పో (1840) లను ప్రభావితం చేసింది. ఆధునిక హారర్ చిత్రాల మీద శేడ్ ప్రభావం వుంది. శేడ్ రచన అధివాస్తవిక ఉద్యమకారులకు అభిమాన పాత్రమయింది. డాడాయిజమ్ ప్రారంభకుడైన ట్రిస్టాస్ జారా శేడ్‌ని అభిమానించాడు.

అన్ని గోథిక్ నవలల్లాగానే-ఈ నవల యొక్క లోకేషన్ ఊహాత్మకమూ, కాలాతీతమూను. ఇందులో వర్ణింపబడిన బ్లాక్ ఫారెస్ట్ మామూలు ప్రపంచంతో సంబంధంలేనిది. ఈ ప్రదేశ వర్ణనకు శేడ్‌కి తన బాల్యంలో చూసిన తన మేనమామ నివసించిన ప్రాసాదమూ, తను నిర్బంధింపబడిన చీకటి జైలు గదులు ఉపయోగపడ్డాయి. శేడ్ తన నవలా కథనం 30 సంవత్సరాల యుద్ధకాలంలో (1618-48) జరిగినట్లు వర్ణించాడు. ఆ కాలంలో ఫ్రాన్సు అనుకోని ఎన్నో అదృష్టాలకు నోచుకుంది. వాటితో బాటుగా వ్యభిచారం, కోరిక ఫ్రాన్సును ఆవరించాయి. శేడ్ తన నవలలో నలుగురు ధనవంతుల్ని ప్రధాన పాత్రలుగా ఎంచుకున్నాడు. ఈ నలుగురు యుద్ధాలు, ప్రకృతి వైపరీత్యాల సహాయంతో అక్రమ సంపదను

పోగు చేసుకుని అలాంటి అవకాశాల కోసం ఎదురు చూస్తుంటారు. ఇలాంటి పాత్రల చిత్రణలో శేడ్ సిద్ధహస్తుడు.

వీరిలో మొదటివాడు డుర్సెట్. ఇతడు 53 ఏళ్ళ వయసుగల బాంకర్. ఇతడే సిల్లింగ్ కాజిల్ యజమాని. ఇతడు మరుగుజ్జుగా, లావుగా, మొద్దుమొహంతో తెల్లగా వుంటాడు. ఇతని తొడలు, పిర్రలు ఆడువాళ్ళవిలాగవుంటాయి. పురుషాంగం మరీ చిన్నదిగా వుంటుంది.

వీడికి ముగ్గురు సహచరులు. వీళ్ళని 'ది ఫ్రెండ్స్' అంటాడు. ఒకడు జమీందారు, మరొకడు వాడి సోదరుడు, మరొకడు బిషప్, ఇంకొకడు జడ్జి. ఈ జడ్జి సంఘానికి మూలస్తంభం లాంటివాడు. 60 యేళ్ళ వయసు, వ్యభిచారం వల్ల మెత్తబడిపోయాడు. పొడుగరి, నీలి కళ్ళు, వికృతమైన నోరు, పొడవాటి ముక్కు, చెక్కపిర్రలు, ఎలుగుబంటి లాంటి శరీరం, కొరడా దెబ్బలతో వాడి, మెత్తబడి వేళ్ళాడే పిర్రలు.

ఈ నలుగురు వ్యభిచారుల్లో ముగ్గురు తమ భార్యల్ని, బిషప్ తన కూతుర్ని తమతో తీసుకువస్తారు. వీరందరికీ మధ్య గందరగోళమైన సంబంధాలుంటాయి. వీరు తమ విలక్షణమైన పద్ధతిలో, స్వేచ్ఛగా జీవితాన్ని ఆనందించాలని నిర్ణయించుకుంటారు. శేడ్ స్త్రీల వర్ణన చర్విత చర్వణంగా వుంటుంది.

వీళ్ళు నలుగురూ కథలు చెప్పే మధ్య వయస్కులూ, వ్యభిచారనేరాలతో అందవికారంగా తయారైన ఆడవాళ్ళను తీసుకొస్తారు. వీళ్ళతోబాటు కిడ్నాప్‌చేసి తీసుకువచ్చిన ఎనిమిది మంది యువకులు, ఎనిమిదిమంది అందమైన యువతులూ, వీరంతా అక్రమశృంగారంలో అనుభవం వున్నవాళ్ళే.

నలుగురు యజమానులూ కలిసి కొన్ని నియమ నిబంధనలు తయారుచేశారు. వాటిని అందరూ తు.చ. తప్పకుండా పాటించ వలసిందే. పాటించని వాళ్ళకు కఠిన శిక్ష వుంటుంది. కథలు చెప్పేవాళ్ళు 30 రోజుల్లో 150 అక్రమ శృంగార విధానాలు, 150 సంక్లిష్ట శృంగార విధానాలు, 150 నేరాలు, 150 హత్యల్ని గురించిన కథలు చెప్పాలి. అవి ఎంత భయానకంగా వుంటే అంత గొప్ప.

పుస్తక ప్రారంభంలోనే శేడ్ తన పాఠకుల్ని తన భయకంరమైన కథనానికి మనసునీ, హృదయాన్నీ సిద్ధం చేసుకోమని సలహాయిస్తాడు. '' 120 డేస్ ఆఫ్ సోడం' కేవలం ఊహాత్మక రచనేగాక అది శృంగార సంబంధిత రోగాలకు, వాటి వైద్యానికి సంబంధించిన రచన కూడా'' అంటాడు జర్మన్ మనస్తత్వ శాస్త్ర వేత్త ఇవాన్ బ్లాక్.

* * * * *

1790 ఏప్రిల్2న శేడ్ విడుదలయ్యాడు. కొత్త అసెంబ్లీ అందరు ఖైదీలను విడుదల చెయ్యమని డిక్రీ జారీ చేసింది. శేడ్‌ని 'మాన్ ఆఫ్ లెటర్స్' గా గుర్తించారు. ఈ కొత్త ప్రపంచంలో తిరిగి అడుగు పెట్టిన శేడ్ చేతిలో చిల్లి గవ్వకూడా లేదు. కంటి చూపు దెబ్బతింది. ఎన్నో సంవత్సరాలు జైలులో వున్న భర్త మానసికంగా చాలా దెబ్బతిని వుంటాడని భావించి, భార్య రెనీ విడాకులు తీసుకుంది.

శేడ్ మళ్ళీ బ్రతుకు తెరువుకోసం నాటక రచనకు పూనుకున్నాడు. 1791 అక్టోబరు 22న ''ది ఎఫెక్ట్స్ ఆఫ్ ఎ రిలాప్స్'' అనే మూడంకాల నాటకాన్ని వ్రాసి ప్రదర్శింపజేశాడు. ఒక పత్రికా విమర్శకుడు ఈనాటకాన్ని పొగిడాడు. 1792 మార్చి 5న ప్రదర్శింపబడిన శేడ్ నాటకం ''ది సెడ్యూసర్'' ని జాకోబియన్లు అడ్డుకున్నారు.

(ఇంకావుంది)

# స్వయం నియంత్రణ

- షణ్ముఖానంద

న్యాయవ్యవస్థ నైపుణ్యాన్ని శంకించాలా? రక్షకభటులు ఉన్నారా? ప్రజలను ప్రభుత్వం పాలిస్తుందా లేక పీడిస్తుందా? కంచే చేను మేస్తుందా? సమాజంలో అన్యాయం, అక్రమం, నేరాలు హింస, దోపిడి, దొంగతనాలు, జూదం, మత్తుపదార్థాల సేవనం, హత్యలు, ఆత్మహత్యలు, లంచగొండితనం, అధికార దుర్వినియోగం, బాలనేరప్రవృత్తి పెరిగిపోతున్నాయి. డబ్బుకోసం మనిషి ఏది చేయడానికైనా వెనుకాడుటలేదు.

దీనికి తోడు మనుషులలో మరీ ముఖ్యంగా యువకులలో మంచి, మర్యాద, గౌరవభావం, వినయవిధేయతలు నశించి మానవ సంబంధాలు ఘర్షణ పూర్వకమైన వాతావరణంలో కొనసాగుతున్నాయి. సంభాషణలో మాధుర్యం పోయి కఠినత్వం చోటుచేసుకుంటోంది. ఉమ్మడి కుటుంబాలు వేరు కుంపటులవుతున్నాయి. వృద్ధులు అనాధరణకు గురి అవుతున్నారు. పసిపిల్లలు-పిల్లల సంరక్షణా కేంద్రాలలోనూ, పిల్లలు పాఠశాల లేదా కళాశాల వసతి గృహంలో ఉంటున్నారు.

మానవత్వం కానరావడంలేదు. ప్రతివ్యక్తిలోనూ దౌర్జన్యం, హింసాభావం, ఆవేశపూరితమైన స్వభావం కలిగి ఉంటుంది. వ్యక్తి సహజీవనం నుండి ఏకాకై ఒంటరి జీవితానికి అలవాటు పడుతున్నాడు. స్నేహభావం నానాటికీ తగ్గుతూ అవి వ్యాపార సంబంధాలుగా తయారవుతున్నాయి. రాజకీయం ప్రజాసేవకు బదులు ''స్వ'' సేవకే అంకితమైంది. సంఘసంస్కర్తలు కరువైనారు.

నానాటికీ నైతిక విలువలు పడిపోతున్నాయి. మానవుల మధ్య అంతరాలు పెరుగుతున్నాయి. వర్ణాలు, కులాల పేరుతోనే ప్రజల మధ్య చీలిక కాక ప్రాంతీయ బేధాలు, విరుద్ధ రాజకీయ పార్టీలు, మతవిశ్వాసాలు, అభిమాన సంఘాలు, గ్రామీణులు, పట్టణవాసి భాషల మధ్య బేధాలు, ఇలా మనిషి తోటి మనిషితో విభేదించగల ప్రతి చిన్న విషయాన్ని ఆధారం చేసుకుని తోటివాళ్ళకి దూరం అవుతున్నాడు. ద్వేషం, కక్ష, పగ, అసూయలు పెరిగి క్షమాగుణం, సహనం, ప్రేమ, ఆదరణ, సహకారం వంటి గుణాలు తరిగిపోతున్నాయి.

వీటన్నిటికీ కారణం ఏ ఒక్కరినో నిందించడం లేదా బాధ్యత అనడం భావ్యం కాదు. మారుతున్న కొత్త జీవన పరిస్థితులకు అనుగుణంగా మానవ స్వభావాన్ని మార్చే, విలువలు ఏ మాత్రం తగ్గకుండా ఉండగలిగేటువంటి ప్రయత్నం మేధావులు, శాస్త్రవేత్తలు, ప్రభుత్వం చేయడం లేదు.

మానవుడి జీవనశైలి, నిత్య కార్యక్రమాలు, మనుగడ స్వభావం, మానవ సంబంధాల రీతులు, వేగంగా మారుతూ ఉన్నాయి. ఆ మార్పుకి, సంప్రదాయంగా వస్తున్న కట్టుబాట్లు సామాజిక నియంత్రణా పద్ధతులు సరితూగడం లేదు. మారుతున్న వ్యవస్థకు తగిన నూతనమైన కట్టుబాట్లు, సంప్రదాయాలు, నియంత్రణలు తయారు అవడం లేదు. ఆ ప్రయత్నంలోపం కనిపిస్తూ ఉంది.

ఆయా సమాజాలకు ఆయా కట్టుబాట్లు, సంప్రదాయాలు, నియంత్రణా పద్ధతులు ఉండి మానవుడిని వాటికి తగినట్లుగా తయారు చేస్తాయి. పాత సాధనాలు కొత్త సమాజాన్ని నియంత్రించలేవు.

---

షణ్ముఖానంద, బౌద్ధ అభిమాని, విపస్సనా ధ్యానంలో ప్రవేశం ఉంది, హైదరాబాదు.

ఏ సామాజిక వ్యవస్థ, ప్రజల సాధారణ వైఖరులను, విలువలను రూపొందిస్తుందో దాని ఉనికిలోనే మార్పు సంభవించినపుడు అది దాని విధి అయిన వ్యక్తిగత ప్రవర్తనా ప్రమాణాలను ప్రభావితం చేయలేదు. అంతేకాదు ప్రతి సమాజం తన సభ్యులను ఒక ప్రత్యేక పద్ధతిలో ప్రవర్తించాలని కోరుకుంటుంది. ఏది మంచో, ఏది చెడో, ఏది చేయకూడదో, ఏది చేయాలో చెబుతుంది. ఆమోదించబడిన సామాజిక ప్రమాణాలకు అనుబద్ధత కల్పించడానికి వ్యక్తులమీద సమూహాల మీద ఒత్తిడిని చూపలేదు. అనగా సామాజిక నియంత్రణని అమలు పరచలేదు.

వ్యక్తి తన చుట్టూ ఉన్న సామాజిక ప్రమాణాలను, విలువలను అంతరీకరణం చేసుకొంటాడు. అనగా వాటిల్ని ఆచరిస్తూ అలవాటుకి గురి అవుతాడు. అప్పుడు అవి అతడి సొంత ప్రమాణాలుగా, విలువలుగా మారతాయి. అనగా అంతర్గతీకరణం జరుగుతుంది.

అంతర్గతీకరణం ద్వారా మానవ సంస్కృతి వ్యక్తిలో అంతర్భాగమౌతుంది. ఈ ప్రక్రియ ద్వారా వ్యక్తి తన సంస్కృతికి చెందిన విలువల ధోరణులు, నమ్మకాలు, ప్రవర్తనా పద్ధతులలో అధిక భాగాన్ని తనలో అంతర్గతం చేసుకుంటాడు. ఈ ప్రక్రియనే సాంఘికీకరణ అంటారు.

కొన్ని సాధనాల ద్వారా వ్యక్తి సాంఘికీకరణకు, సాంఘిక నియంత్రణకు గురి అవుతాడు. ఆ సాధనాలను పరిశీలిస్తే ఆ సాధనాలలో వస్తున్న మార్పు తదనుగుణంగా వ్యక్తిలో వస్తున్న మార్పులను గమనించవచ్చు. కొన్ని సందర్భాలలో సాంఘికీకరణ సాధనాలే సాంఘిక నియంత్రణా సాధనాలుగా పనిచేస్తాయి.

**1. కుటుంబం:** పసిబిడ్డ కుటుంబ సభ్యుల నుండి ప్రాథమిక ధోరణులు, విలువలు, నమ్మకాలు, మతవిశ్వాసాలు అనుకరణ ద్వారా నేర్చుకుంటాడు. వ్యక్తి యొక్క మూర్తిమత్వం అభివృద్ధి చెందడానికి కుటుంబమే ప్రధాన బాధ్యత వహిస్తుంది. అలాంటి కుటుంబం ఎన్నో మార్పులకు లోనైనది. ఉమ్మడి కుటుంబస్థాయి నుండి ముగ్గురు సభ్యులు గల కుటుంబ స్థాయికి పడిపోయింది. ఇందువల్ల ఎక్కువ కుటుంబ సభ్యులతో సన్నిహిత సంబంధం లేక పిల్లలు ప్రాథమిక ప్రవర్తనా ధోరణులను, నేర్పులను కూడా పొందలేకపోతున్నారు. పిల్లలకు తమ భావోద్రేకాలు అదుపులో పెట్టుకోవడానికి వాటిని సరి అయిన మార్గంలో మళ్ళించడానికి తగిన శిక్షణ లభించడం లేదు. తల్లి సంరక్షణ, కుటుంబ సభ్యుల ప్రేమాదరణలకు నోచుకోని పిల్లలు అనాథాశ్రమాలలో పెరిగే పిల్లల మాదిరి ఇతరులతో కలసి మెలసి తిరగడానికి ఇష్టపడరు. పసిబిడ్డ ఎంత ఎక్కువ మందితో సంపర్కం చెందితే అంతవేగంగా విషయాలను గ్రహించగలదు. పసితనం నుండే ఒంటరి జీవితానికి గురి అవుతున్నారు. అక్క, చెల్లి, తమ్ముడు, అన్న, తాత, అవ్వ కలిగి ఉండే కుటుంబ స్థాయి నుండి పసివాడు కేవలం మమ్మి డాడీలకే కుదించబడ్డాడు.

**2. మతం:** మతం వ్యక్తి మీద శక్తివంతమైన ప్రభావం నెరపుతుంది. సాంప్రదాయాలను కల్లోల పరిచే వారి మీద దైవాగ్రహం అనే సాధనాన్ని ప్రయోగిస్తూ రక్షక భటుని పాత్ర వహిస్తుంది. అయితే నానాటికి పెరిగిపోతున్న నాస్తిక, హేతువాద, భౌతిక వాద, భావ ప్రచారంతో ప్రజలలో మత విశ్వాసాలు పట్ల నమ్మకం చెదురుతుంది. మతవిశ్వాసాలతో ఏర్పడిన దైవ భీతితో వ్యక్తి లోగడ చేయతలపెట్టని దుష్ట చర్యలను, ఇప్పుడు యథేచ్ఛగా చేస్తున్నాడు. ప్రజలలో నైతిక విలువలను స్థాపించిన తరువాతనే పాపభీతి, దైవ ఆగ్రహం, మొదలగు భావాలను నాస్తికులు ప్రజలలో తొలగించవలసినది.

**3. విద్య:** విద్య యొక్క సార్వత్రిక క్రియ ఏమిటంటే సంస్కృతిని ఒక తరం నుండి మరొక తరానికి అందచేయడం నియమాలు, విలువలూ అందచేయడం. విద్య మనుష్యులకు క్రమ శిక్షణనూ, సహకారాన్ని, త్యాగాన్ని, నిజాయితీ, న్యాయదృష్టి మొదలగు గుణాలను కల్గిస్తుంది. సమాజం పారిశ్రామీకరణ చెందినందువల్ల సాంకేతిక విద్య యొక్క ఆవశ్యకత పెరిగింది. దీనితో విద్య యొక్క స్వరూపం మారి విద్యార్థిలో విద్య, మంచి గుణాలను పెంపొందించ లేకుండా వుంది. కాన్వెంటులు, పాశ్చాత్య భాష, మన సంస్కృతిని నిలబెట్టలేకపోతున్నాయి.

**4. ప్రచారం:** ప్రజల ప్రవర్తనకును, వైఖరులను నియంత్రించడానికి ప్రచారం అత్యంత సమర్థమైన సాధనం. ప్రజలకి వినోదం పేర హింస, అశ్లీలాన్ని బాగా చూపుతూ ప్రచారం చేస్తూ సినిమా పరిశ్రమ తన సామాజిక బాధ్యతను విడనాడింది.

**5. కళా, సాహిత్యం:** హిందూ సమాజంలో పితృవాక్య పరిపాలన, ఏకపత్నీవ్రతం వంటి నియమాలు ఆచరణలో ఉన్నాయంటే కారణం రామాయణ మహాకావ్యం. కాబట్టి కళ, సాహిత్యం, చిత్రకళ, సంగీతం, నృత్యం వంటి కళారూపాలకూ సాంఘికీకరణకు మరియు నియంత్రణకు మధ్య గాఢమైన సంబంధం ఉంది. నేడు ఈ రంగం కూడా కలుషితమై 'కళ, కళ కోసం'' అనే ఉన్నతి నుండి ''కళ డబ్బు కోసం'' అనే నిమ్నస్థితికి దిగజారి ప్రజలను ప్రక్కదారులు పట్టిస్తుంది.

**6. నాయకత్వం:** నాయకుడు నీతి, నియమాలను తాను స్వయంగా పాటిస్తూ ఇతరులను పాటించేటట్లు ప్రభావితుల్ని చేయగలడు. ''నీతి నియమాలు మీకు కాని నాకు కాదు'' అన్నట్లుగా వుంది ప్రస్తుత మన నాయకుల ప్రవర్తన.

**7. గ్రామీణ వ్యవస్థ:** భారతదేశంలో ఎక్కువ జనాభా గ్రామీణ ప్రాంతాలలోనే నివసిస్తున్నారు. రానురాను పట్టణీకరణ వృద్ధి చెందుతూ గ్రామాలలో నివసించే వారి సంఖ్య తగ్గుతూ వున్నది. సామాజిక నియంత్రణ గ్రామ వాతావరణంలో కట్టుదిట్టంగా అమలు అవుతుంది. గ్రామాలలో జనసాంద్రత తక్కువ కనుక ప్రతి ఒక్కరూ అందరి దృష్టిలోకి వచ్చి ముఖాముఖి సంబంధాలు ఏర్పడతాయి. వ్యక్తి ''శీలం'' గుర్తించబడి అవసరమైతే మార్పుకు గురి చేస్తుంది.

**8. పాఠశాల:** విద్యాబోధన ద్వారా మాత్రమే గాక స్కౌట్స్, గైడ్స్, వ్యక్తిత్వ పోటీలు, ఆటలపోటీలు సాంస్కృతిక కార్యకలాపాల ద్వారా కూడా పాఠశాలలు పిల్లలకు సాంఘికీకరణ కలుగజేస్తాయి. నేడు ఇవన్నీ ఎన్ని పాఠశాలల్లో ఉన్నాయో అందరికీ తెలుసు.

మనిషి తోటి వారితో వ్యవహరించేటపుడు కొన్ని పనులు చేయకూడదని, కొన్ని చేయవచ్చుని ఉదా: రోడ్డుకి ఎడమ వైపే నడవాలని, పెద్దలకు నమస్కరించవలెనని, భూతు, అసత్యం పలకరాదని నేర్చుకుంటాడు. అమలుపరుస్తాడు. అలా అమలు పరచనపుడు తల్లో, తండ్రో, గురువో, పెద్దవాడో హెచ్చరిస్తాడు. అవసరమైతే దండిస్తాడు. కొంతకాలానికి ఈ హెచ్చరికలు, సూచనలు అతని మనస్సులో నాటుకుని పోయి ఆ మనసే ఒక తండ్రి లాగా, తల్లిలాగా తయారు అయ్యి ఇది చేయకు, అలా చేయకు అంటూ నియంత్రిస్తుంది. దీనినే మనం అంతరాత్మ అంటాము. సాంఘికీకరణ సాధనాల ద్వారానే మనిషిలో అంతరాత్మ ఏర్పడుతుంది. సమాజంలో అర్థవంతంగా జీవించడం కోసం సమాజ ప్రమాణాలను, నీతి నియమాలను, విలువలను మనిషి సొంతం చేసుకుంటాడు. అనగా అవి తన అంతరంగంలోని అంశాలుగా మారిపోతాయి. ఈ అంతరాత్మ

ఎల్లప్పుడూ వ్యక్తి చేసే పనులను నైతిక స్థాయి నుండి పరిశీలించి విమర్శిస్తుంది. మనిషి కొన్ని విషయాలను మంచివనుకుంటాడు. వాటికి అనుగుణంగా జీవించలేనపుడు పాశ్చాత్తాప, అపరాధ భావనతో క్రుంగిపోతాడు. దీనికి కారణం అంతరాత్మ. ఈ విధంగా అంతరాత్మ సమాజం అంగీకరించని ప్రవర్తనని అదుపు చేస్తుంది. సమాజానికి భద్రత, స్థిరత్వం చేకూరుస్తుంది. దీనినే స్వయం నియంత్రణ అంటారు. నేడున్న సమాజం తన సాధనాల ద్వారా మనిషిలో అంతరాత్మను, సమాజానికి అనుగుణంగా సమాజం అంగీకరించేలాగా ఏర్పడేటట్లు చేయలేక తద్వారా స్వయం నియంత్రణకు గురిచేయలేకపోతుంది.

రెండవది అయిన బాహ్యమైనటువంటి సామాజిక నియంత్రణ ధనాత్మకం కావచ్చు, ఋణాత్మకం కావచ్చు. సమాజం ఆమోదించిన ప్రవర్తనను ఉత్సాహపరిచేందుకు ధనాత్మక నియంత్రణ ఉద్దేశించబడింది. ఇవి సమాజం ఆశించిన వాటికి, ప్రమాణాలకు వ్యక్తి కట్టుబడి ఉండేలాగా తయారు చేస్తాయి. సామాజిక నియంత్రణ యొక్క ఋణాత్మక రూపాలు, చట్టాలు, కోర్టులు, శిక్షలు, పోలీసులుగా ఉంటాయి.

ఎవరైనా విలువలను అంతరీక పరుచుకుని ఉన్నవాడు చుట్టూ పతనమైన పరిస్థితులను చూసి తన జీవనాన్ని కొనసాగింపుకై ''నలుగురితో నారాయణ'' అన్నట్లు తన విలువలను మార్చుకుంటూ అనగా పునర్ సాంఘికీకరణకు గురి అవుతూ, తద్వారా ఎక్కడైనా కొంచెం మంచితనం, మానవత్వం నీతి నియమాలు ఉంటే అవికూడా నశిస్తున్నాయి.

ఎప్పుడైతే, ఎక్కడైతే సాంఘికీకరణ మరియు నియంత్రణా సాధనాలు వైఫల్యం చెందినాయో అక్కడ వ్యక్తిలో అంతరాత్మ ఏర్పడదు. అనగా స్వయం నియంత్రణా యంత్రాంగం లేనట్లే. ఇక మిగిలింది బాహ్యమైనటువంటి నియంత్రణ. అది లోపభూయిష్టంగా, బలహీనంగా ఉన్నప్పుడు వ్యక్తికి స్వేచ్ఛ లభించినట్లై విచ్చలవిడిగా ప్రవర్తిస్తాడు. తద్వారా అరాచకం పెరిగిపోతుంది. దీనిని అరికట్టేందుకు కొన్ని విధానాలను పరిశీలించవలసి ఉంటుంది.

i) ప్రభుత్వంలో సామాజిక నియంత్రణ పేరుతో మంత్రిత్వ శాఖ ఉండాలి

ii) పాశ్చాత్య నాగరికత దిగుమతిని అరికట్టాలి.

iii) పట్టణీకరనను అరికట్టి గ్రామాలను స్వయం సమృద్ధిగా చేయాలి.

iv) విలాసవంతమైన జీవన విధానాన్ని ప్రోత్సహించకూడదు.

v) వివిధ రకాలైన సాంఘిక సంస్థలను నిర్మించి ప్రతి ఒక్కరిని సాధ్యమైనన్ని సంస్థల్లో సభ్యుడు అయ్యేటట్లు చూడాలి.

vi) ప్రతి ఒక్కరిని తాను నీతివంతుడిగా జీవించడమే గాక ఇతరుల అవినీతిని ప్రశ్నించగలిగే సైనికుడిలాగా తయారుచేయాలి.

vii) వృద్ధులు పిల్లల అనాధరణకు గురి అయినట్లయితే పిల్లల ఆదాయం నుండి వృద్ధులకు కొంత అందేటట్లు ప్రభుత్వం చట్టం తీసుకురావాలి.

viii) కొత్తవైనటువంటి సాంఘికీకరణ సాధనాలను, సాంఘిక నియంత్రణా సాధనాలను తగినట్లుగా, కనిపెట్టవలసి వుంది.



మదర్

MISIMI / మిసిమి / RNI Regd.No.45042/90 Telugu Monthly, Hyderabad - 500 020
Postal Regd.No.H/SD-191/2003-05



పియానోతో